

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సోమవారం-23- జూన్ - 2025 | సంపుటి : 3 | సంచిక : 27 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# అమెరికా బాంబుల మోత

## ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్

## ఫోర్డో, నతాంజ్‌పై బంకర్ బస్టర్ బాంబుల వర్షం



- బీ–2ఏ బాంబర్లతో 37 గంటల సుదీర్ఘ దూకుడు
- ఇస్ఫహాన్‌పై టోమాహాక్ క్షిపణుల మోత
- మొత్తం 125 అమెరికా విమానాలు
- 'ప్లానెట్ ల్యాబ్స్' ఉపగ్రహచిత్రాల్లో నాశనంపై స్పష్టం
- అణుబాంబు తయారీని అడ్డుకునేందుకే దాడి: అమెరికా
- దౌత్యం పక్కన పెట్టి పోరాటం: అబ్బాస్ హెచ్చరిక
- 4 క్షిపణితో ఇరాన్ ఘాటుగా స్పందన
- అణుధార్మికత లేనట్లు ఐఏఈఏ స్పష్టత

టెహ్రాన్ (తెలంగాణ ముచ్చట్లు)

పచ్చగడ్డి వేస్తే భగ్గున మండే శత్రుత్వంతో పరస్పర దాడులు చేసుకుంటున్న ఇరాన్, ఇజ్రాయెల్ మధ్యలోకి అగ్రరాజ్యం హఠాత్తుగా వచ్చి భీకర దాడులతో పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలను మరింత ఎత్తుకు ఎగదోసింది. పర్వతగర్భంలో పటిష్టంగా, రహస్యంగా ఉన్న ఫోర్డో యురేనియం శుద్ధి కర్మాగారాన్ని బద్దలుకొట్టే లక్ష్యంతో అమెరికా యుద్ధవిమానాలు వేల కేజీల బరువైన అతిభారీ బాంబులతో విరుచుకుపడ్డాయి.

మిగతా 2లో..









# వరంగల్ కాంగ్రెస్‌లో భగ్గుమన్న అసంతృప్తి

- వరంగల్ ఎమ్మెల్యేల అసంతృప్తి పీక్ స్టేజ్
- మంత్రి సురేఖపై తిరుగుబాటు జెండా ఎగరవేత
- మీనాక్షీ నటరాజన్‌ను కలిసిన అసంతృప్త నేతలు
- కొండా మురళి వ్యాఖ్యలు వివాదాలకు దారితప్పిన పరిస్థితి
- నాయిని, రేవూరితో కలసిన కడియం శ్రీహరి
- కొండా కుటుంబానికి ఎమ్మెల్యేల కౌంటర్
- ఢిల్లీకి వెళ్లేందుకు నేతల ఆలోచన
- అధిష్టానం వద్ద కొండా సురేఖపై ఫిర్యాదుకు కసరత్తు

(తెలంగాణ ముచ్చట్లు)

వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య పొలిటికల్ వార్ పీక్ స్టేజ్‌కు చేరుకుంది. జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు.. మంత్రి కొండా సురేఖ మీద తిరుగుబాటు జెండా ఎగరేశారు. మంత్రిపై ఫిర్యాదు చేసేందుకు నేతలందరూ కూటమి కట్టారు. ఇక, తాజాగా హస్తం నేతల పంచాయతీ తాజాగా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ వద్దకు చేరుకుంది.

వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీనాక్షి నటరాజన్ భేటీ అయ్యారు. కడియం శ్రీహరి, కార్పొరేషన్ చైర్మన్, ఎర్రబెల్లి స్వర్ణ తదితర నేతలు మీనాక్షి నటరాజన్‌తో సమావేశం అయ్యారు.

మిగతా 2లో..



# తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారు

- ధనిక రాష్ట్రంగా మొదలై అప్పుల్లో కూరుకుపోయిన తెలంగాణ
- కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని నాశనం చేశారు: కిషన్‌రెడ్డి
- బీఆర్ఎస్ పాలన అవినీతి, అహంకారంతో నిండి ఉంది
- ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరించిన బీఆర్ఎస్

2లో..

# నాన్-ట్యాక్స్ ఆదాయం పెంపుపై దృష్టి చేపట్టండి



- కేంద్ర నిధుల కోసం అధికారుల దృష్టిసారణపై ఆదేశం
- అన్ని శాఖలకు సమాన నిధుల పంపిణీ చేయాలని భట్టి ఆదేశం
- అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచన
- రూ.33,600 కోట్లతో కొత్త సంక్షేమ పథకాల అమలు
- గత ప్రభుత్వ పథకాలను నిలిపివేయకుండా కొనసాగింపు
- మేజర్ ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యత ఇవ్వాలి
- శాఖల మధ్య నిధుల వ్యత్యాసం తగ్గించాలి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రంలో పన్నేతర (నాన్‌ట్యాక్స్) రెవెన్యూ రాబడులను పెంచడంతోపాటు కేంద్ర నిధులను సాధించుకోవడంపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించాలని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ క్యాపిటల్ సబ్‌కమిటీ చైర్మన్, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార ఆదేశించారు. ప్రజాప్రయోజనాలు, అభివృద్ధి, ప్రజాసంక్షేమం, ప్రభుత్వ ఆలోచనల మేరకు అధికారులు పని చేయాలని సూచించారు. రాష్ట్ర అవసరాలు, ప్రాధాన్యతన మేరకు బడ్జెట్ నిధులను ఖర్చు చేయాలని చెప్పారు. సచివాలయంలో ఆదివారం జరిగిన అసెట్స్ సబ్ కమిటీ భేటీలో మంత్రులు,

# కాళేశ్వరం స్కాంపై రేవంత్ సర్కార్ మౌనం

- కాళేశ్వరం కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందని విమర్శ
- స్కాంలపై చర్యలు లేకపోవడం రేవంత్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం
- అవినీతి విచారణను అధికారులకే పరిమితం చేయొద్దు: బండి సంజయ్
- నీటి లభ్యత ఉందన్న నివేదికల్ని బీఆర్ఎస్ ఎందుకు నిర్లక్ష్యమైంది?
- రూ.38 వేల కోట్ల ప్రాజెక్టు.. ఎలా లక్షా 20 వేల కోట్లకు చేరింది?
- జాతీయ హోదా కోసం చేసిన ప్రయత్నాలు సమర్థనీయం కాదన్న బీజేపీ
- కేంద్రాన్ని తప్పబట్టే హక్కు బీఆర్ఎస్‌కు లేదన్న వ్యాఖ్య
- ఎన్డీఎస్ఏ నిర్ణయాలను కాపాడే చట్టబద్ధ కమిటీ అని స్పష్టం



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కాళేశ్వరం విషయంలో ఏం జరుగుతుందో అందరికీ తెలిసిందేనని.. కేసీఆర్ కుటుంబానికి రేవంత్ ప్రభుత్వం రక్షణ కవచంలా మారిపోయిందంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు.

మిగతా 2లో..

# గ్రామాల అభివృద్ధికి నిధుల కొరత

- పంచాయతీలకు నిధులివ్వక అభివృద్ధి స్తంభన
- పారిశుద్ధ్యం లేదని, వీధిదీపాలు లేక పల్లెలు అంధకారంలో
- ట్రాక్టర్లకు డీజిల్, టాక్స్ లేక తాళాలు అప్పగిస్తున్న అధికారులు
- బిల్లులు చెల్లించకుండా బాధపడుతున్న మాజీ సర్పంచులు
- ప్రభుత్వం స్పందించకపోతే గ్రామీణ పరిస్థితులు మరింత దిగజారే పరిస్థితి
- జూనియర్ కార్యదర్శులుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ డిమాండ్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

పంచాయతీలకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో అభివృద్ధి స్తంభించిపోయిందని, పల్లెల్లో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసిందని మాజీ మంత్రి హరీశ్ ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాలకు నిధులు విడుదల చేయాలని, మాజీ సర్పంచులు, కార్యదర్శుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మిగతా 2లో..





# రూ.20 లక్షలతో పంచాయతీ భవనాల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం కోసం 549 గ్రామాల్లో స్థలాలు గుర్తించామని, మరో 84 గ్రామాల్లో గుర్తించాల్సి ఉన్నదని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క తెలిపారు. అంగన్‌వాడీ భవనాల కోసం 813 స్థలాలు గుర్తించగా, మరో 98 గుర్తించాల్సి ఉన్నదని చెప్పారు. త్వరలోనే భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేస్తామని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉపాధి హామీ నిధుల ద్వారా ఒకో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు ఖర్చు చేయనున్నట్టు వివరించారు.

# నక్సలిజం అంతం అయ్యే వరకు ఆపరేషన్ కొనసాగుతుంది

- వర్షా కాలం కావడానికీ మావోయిస్టులకు ఊరట ఉండదన్న అమిత్ షా
- నక్సల్స్‌పై నిరంతర ఆపరేషన్‌కి కేంద్ర హోంమంత్రి హెచ్చరిక
- ఆయుధాలు వదిలి సమాజంలో కలవాలని మావోయిస్టులకు పిలుపు
- మార్చి 2025లోగా నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యం
- జనజీవనంలో కలిసినవారికి హామీల అమలుపై కేంద్ర హామీ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

మావోయిస్టులు సాధారణగా వర్షాకాలంలో విశ్రాంతి తీసుకుంటారని, కానీ ఈ వర్షాకాలంలో కూడా మావోయిస్టులను నిద్రపోనివ్వనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. వర్షాకాలంలో కూడా ప్రభుత్వ ఆపరేషన్ కొనసాగుతుందని హెచ్చరించారు.

మిగతా 2లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : హెల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# అమెరికా బాంబుల మోత

(మొదటి పేజీ తరువాయి)



ఇరాన్ రాజధాని సమీప ఫోర్డో అణుకేంద్రంపై శనివారం అర్ధరాత్రిదాటాక గంటలకు జీబీయూ-57 ఏ/బీ మ్యాసివ్ ఆర్డ్‌నెన్స్ పెనిట్రేటర్(ఎంఓపీ) గైడెడ్ బాంబులను అమెరికా బీ-2ఏ స్పిరిట్ స్టెల్త్ బాంబర్ విమానాలు జారవిడిచాయి. ఈ బాంబులు 200 అడుగుల లోతుకు చొచ్చుకెళ్లి అక్కడి భూగర్భాన్ని బద్దలుకొట్టాయి. నతాంజ్ అణు కేంద్రంపైనా అమెరికా ఇవే బాంబులను వేసింది. మొత్తంగా 14 జీబీయూ బాంబులను ఉపయోగించినట్లు అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్, జనరల్ డేనియల్ కెయిన్ వెల్లడించారు.

**ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్..**

శనివారం అర్ధరాత్రిదాటగానే 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్'పేరిట ఈ దాడులను చేసింది. అమెరికాలోని మిస్సోరీలోని వైట్‌హ్యాన్ వైమానిక స్థావరం నుంచి ఆరు బీ-2ఏ విమానాల దండు దండయాత్ర మొదలైంది. ఏకధాటిగా 37 గంటలపాటు ప్రయాణించి, మార్గమధ్యంలో గాల్లోనే ఇంధనాన్ని నింపుకుంటూ 11,400 కిలోమీటర్లు ప్రయాణించిమరీ ఫోర్డో, నతాంజ్ అణుకేంద్రాలపై ఒక్కోటి దాదాపు 14,000 కేజీల బరువుండే 14 బంకర్ బస్టర్ బాంబులను పడేశాయి.

ఆ తర్వాత ఇస్ఫహాన్ అణుకేంద్రంపై అమెరికా జలాంతర్గామి 30 టోమాహాక్ క్రూజ్ క్షిపణులను ప్రయోగించింది. ఈ మూడు అణుకేంద్రాలపై 75 దాకా గైడెడ్ క్షిపణులను ప్రయోగించి విధ్వంసం సృష్టించింది. మొత్తంగా 125 విమానాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. కొన్ని విమానాలు దాడిచేయగా మిగతావి శత్రుసేనలను తికమక పెట్టేందుకు వేర్వేరు దిశల్లో చక్కర్లు కొట్టాయి. మెరుపువేగంతో దాడులుచేసి తిరిగి తమతమ స్థావరాలకు చేరుకున్నాయి. యుద్ధ, రవాణా, ఇంధన విమానాలు ఈ 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్'లో పాల్గొన్నాయి. అమెరికా దాడుల్లో అణుకేంద్రాల్లో మౌలికవసతులు ఏ స్థాయిలో నాశనమయ్యాయో ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. అయితే పర్వతం పైభాగంలో ఆరు భారీ రంధ్రాలు పడ్డట్లు తాజాగా తీసిన 'ప్లానెట్ ల్యాబ్స్ పీబీసీ'ఉపగ్రహ ఫొటోల్లో కనిపించింది.

అయితే అణుబాంబు తయారీని అడ్డుకునేందుకు బాంబులేశామని, ఇరాన్‌లో యుద్ధాన్ని ఎగదోసి, ప్రస్తుత ప్రభుత్వాన్ని పడగొట్టే ఉద్దేశ్యం తమకు లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టంచేశారు. అయితే అణుబాంబు తయారీ సామర్థ్యాన్ని ఇరాన్ సంతరించుకోవద్దనే లక్ష్యంతోనే తాము యుద్ధంలో పాల్గొన్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ సైనికచర్యను సమర్థించుకున్నారు.


తమపై ప్రతిదాడి చేస్తే మిగతా లక్ష్యాలపై దాడులు తప్పవని ఇరాన్‌ను హెచ్చరించారు. అయితే దాడుల తర్వాత ఆయా అణుకేంద్రాల నుంచి ఎలాంటి అణుధార్మికత వెల్లడైన ఛాయలు కనిపించలేదని అంతర్జాతీయ అణుఇంధన ఏజెన్సీ స్పష్టంచేసింది. దాడికి ముందే అక్కడి నుంచి యురేనియం నిల్వలను తరలించినట్లు ఇరాన్ అధికారులు వెల్లడించారు.

**ఊహించనిస్థాయిలో దెబ్బకొడతాం: అబ్బాస్**

ఓవైపు అణు మధ్యవర్తిత్వం కోసం స్వాగతం పలుకుతూ మరోవైపు సమరాగ్నిని రాజేస్తున్న అగ్రరాజ్యాన్ని ఊరికే వదిలిపెట్టబోమని ఇరాన్ ప్రతిజ్ఞచేసింది. చరిత్రలో ఎన్నడూలేని స్థాయిలో దాడులుచేసి బదులు తీర్చుకుంటామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ప్రకటించారు. ఇస్తాంబుల్‌లో జరుగుతున్న ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోపరేషన్ సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన అబ్బాస్ ఆదివారం మీడియాతో మాట్లాడారు.


''దౌత్యనీతిని కాలరాస్తూ అమెరికా మాపై దాడులకు తెగబడింది. మేం దౌత్యాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టి దేశ రక్షణ కోసం భీకరపోరు చేయాల్సిన తక్షణావసరమిది. దుస్సాహసంతో దారుణంగా దాడులు చేసిన యుద్ధోన్మాద అమెరికా తదుపరి తీవ్ర పర్యావసానాలకు బాధ్యతవహించాల్సి ఉంటుంది. అమెరికా చర్యలకు ఇరాన్ తన సైన్యంతో బదులుతీర్చుకుంటుంది.

దేశ భద్రత, జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు ఇరాన్ పాటుపడుతుంది''అని అబ్బాస్ అన్నారు. మరోవైపు తమపై దాడిచేసిన ఇజ్రాయెల్‌పైనా ఇరాన్ ఆదివారం మిస్సైళ్లను ప్రయోగించింది. తన అమ్ములపొదిలోని మధ్యస్థ శ్రేణి ఖుర్రమ్‌షహర్-4 క్షిపణిను సైతం ఇరాన్ ప్రయోగించింది. ఇది ఒకేసారి 1,500 కేజీల బరువైన వేర్వేరు వార్‌హెడ్లను ఏకంగా 2,000 కిలోమీటర్లదాకా మోసుకెళ్లగలదు. ఈ క్షిపణిని ఈ యుద్ధంలో వాడటం ఇదే తొలిసారి అని తెలుస్తోంది.







# వరంగల్ కాంగ్రెస్‌లో భగ్గుమన్న అసంతృప్తి

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో చర్చలో ఏం చేస్తారు.. ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. అయితే, ఇప్పటికే వరంగల్ పంచాయతీపై పీసీసీ చీఫ్‌కు సీనియర్ల నివేదిక అందింది. సీనియర్ల నివేదిక ఆధారంగా మీనాక్షి నటరాజన్ నిర్ణయం తీసుకోనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి.

కొండా మురళి వ్యాఖ్యల ఎఫెక్ట్..

అయితే, ఇన్ని రోజులు మంత్రి కొండా సురేఖ జిల్లాలో నేతలను కలుపుకుని పోవడం లేదన్న అసంతృప్తి ఉంది. ఇదే సమయంలో తాజాగా మంత్రి భర్త కొండా మురళి చేసిన తాజా వ్యాఖ్యలు అగ్గికి మరింత ఆజ్యం పోశాయి. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు ఒకరిద్దరు నేతల్ని ఉద్దేశించి మురళి కామెంట్స్ చేశారు. పార్టీ మారినప్పుడు పదవులకు రాజీనామాలు చేసి రావాలంటూ.. మురళి అన్న ఆ మాటలే ఎమ్మెల్యేలందర్నీ ఏకం చేసినట్టు చెప్పుకుంటున్నారు. అప్పటిదాకా.. ఎవరి దారి వారిదే అన్నట్టున్నగా ఉన్న శాసనసభ్యులు.. కొండా మురళి వ్యాఖ్యలతో ఒక్క తాటి మీదికి వచ్చినట్టు సమాచారం.

కొండా మురళి వ్యాఖ్యలతో.. కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి అంతా ఇప్పుడు ఏకమైనట్టు తెలిసింది. కొండా ఫ్యామిలీకి రేవూరి ప్రకాష్‌రెడ్డితో కూడా కయ్యం మొదలైంది. ఇప్పుడు వరంగల్ సిటీలోని ఎమ్మెల్యేలతో పాటు.. కడియం శ్రీహరి లాంటి వాళ్ళంతా కలిసి కొండా దంపతులపై సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. త్వరలో వీరంతా.. ఢిల్లీ వెళ్ళి అధిష్టానం పెద్దలకు మంత్రి మీద ఫిర్యాదు చేయాలనుకుంటున్నట్టు సమాచారం.

## కాళేశ్వరం స్కాంపై రేవంత్ సర్కార్ మౌనం



(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఏ ఒక్క స్కాంలో కూడా కనీస చర్యలు లేకపోవడమే అందుకు సాక్ష్యమన్నారు. అందుకే.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని తెలంగాణా ప్రజలు డిసైడ్ అయ్యారని బండి సంజయ్ చెప్పుకొచ్చారు. ''కాళేశ్వరం కేసీఆర్ కుంటుంబానికి ఏటీఎంలా మారింది. నిజాయితీగా పదకొండేళ్ల నుంచి పాలన చేస్తోన్న మోదీ నుంచి అమిత్ షా అందరూ అదే చెప్పారు. కాళేశ్వరం అవినీతి, అక్రమాలతో కూడిన ప్రాజెక్ట్. కాళేశ్వరం ప్రాజెక్టులో పని చేసిన అధికారులే వందల కోట్లు సంపాదించుకున్నారు. ఈ అవినీతిపై విచారణను రేవంత్ సర్కార్ అధికారులకే పరిమితం చేయొద్దు. సీడబ్ల్యూసీ 1986 నుంచి 2013 వరకు 160 టీఎంసీల నీటి లభ్యత ఉన్నదంటే.. కేసీఆర్ కుటుంబానికి మాత్రం నీటి లభ్యత ఎందుకు కనిపించలేదు..?'' అంటూ బండి సంజయ్ ప్రశ్నించారు. ''ఈ రిపోర్ట్ ప్రకారం ప్రాజెక్టు కడితే 38 వేల కోట్లలో ప్రాజెక్టు కడితే.. ఇవాళ లక్షా 20 వేల కోట్లు అయ్యేవా?. జాతీయ హోదా ఇస్తే కేంద్రం ఇజ్జత్ పోయేది. ఇంకా సిగ్గు లేకుండా జాతీయ హోదా అడుగుతున్నారు. ఎన్డీఎస్‌ఏ తాగి కూర్చున్న కమిటీ కాదు.. చట్టబద్ధంగా ఏర్పడిన కమిటీ. క్యాబినెట్‌లో ఎప్పుడు పెట్టారు?. ఎప్పుడు సబ్ కమిటీ నివేదిక ఇచ్చింది?. ఎప్పుడు ప్రాజెక్ట్ ప్రారంభించారో రేవంత్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదు..?. కాళేశ్వరం లేకున్నా ఇవాళ పంట దిగుబడి ఎందుకు పెరిగిందో బీఆర్‌ఎస్ చెప్పాలి. రేవంత్ సర్కార్ వచ్చాక వారు విచారణ చేయరు.. సీబీఐకి అప్పగించరు'' అంటూ బండి సంజయ్ వ్యాఖ్యానించారు.



## తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ధనిక రాష్ట్రంగా మొదలైన తెలంగాణ.. లక్షల కోట్లు అప్పుల పాలైందని కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకుంటే.. ఒక కుటుంబం బారిన పడి బలి అయ్యిందని మండిపడ్డారు. అవినీతి పాలనతో, దోపిడితో,, కుంభకోణాలతో, అహంకారంతో, కుటుంబ పాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా బీఆర్ఎస్ పార్టీని ఏ రకంగా పని చేసిందో మనం చూశామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఇక గడిచిన ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే ఆ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని వమ్ముచేసిందన్నారు. మహిళలు, రైతులు, నిరుద్యోగ యువకులు, దళితులకు డిక్లరేషన్ల పేరుతో అనేక హామీలు ఇచ్చి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. అప్పులు ఇచ్చే వారు లేరని, తనను నమ్మే వాడు లేడని సీఎం రేవంత్‌రెడ్డి చేతులెత్తేశాడన్నారు. పరిపాలన చేతకాక, హామీలు అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేతులెత్తేసిందని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

# గ్రామాల అభివృద్ధికి నిధుల కొరత

(మొదటి పేజీ తరువాయి)



గ్రామీణ ప్రాంతాల సమస్యలు, పరిష్కారాలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క)కు హరీశ్ ఆదివారం లేఖ రాశారు. గ్రామాల సమగ్రాభివృద్ధిలో భాగంగా 2019లో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం 9,350 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించిందని గుర్తుచేశారు. ప్రభుత్వ ఆదేశానుసారం పంచాయతీల అభివృద్ధి కోసం వారు ఎంతో శ్రమించారని తెలిపారు. గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధుల మంజూరు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారుల కృషివల్ల తెలంగాణ పల్లెలు అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితులు భిన్నంగా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు.

**అంధకారంలో గ్రామాలు**

నిధుల్లేక పంచాయతీల అభివృద్ధి ఎకడికకడే నిలిచిపోయిందని హరీశ్ వాపోయారు. పారిశుద్ధ్యం పడకేసిందని, వీధి దీపాల నిర్వహణ లేక పల్లెలు అంధకారంలో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. చివరకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్లలో డీజిల్ పోయించలేక, ఆర్టీఏ టాక్స్ కట్టలేక అధికారులు వాటి తాళాలను ఉన్నతాధికారులకు అప్పగిస్తున్న దుస్థితి దాపురించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోయినా, పంచాయతీ అధికారులు అప్పులు తెచ్చి మరీ నిర్వహించే ప్రయత్నం చేశారని తెలిపారు. ఓవైపు అప్పులు పెరగటం, మరోవైపు ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో కార్యదర్శులపై ఆర్థిక భారం మరింత పెరిగి వారు మానసిక ఆందోళనకు గురవుతున్నారని వాపోయారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తే నిధుల విడుదల మరింత కష్టతరమవుతుందని బాధపడుతున్నారని తెలిపారు. మాజీ సర్పంచులు సైతం చేసిన పనులకు బిల్లులు రాక తీవ్ర ఆందోళన చెందుతున్నారని వివరించారు.

**ఆరు డిమాండ్లు నెరవేర్చండి..**

అభయహస్తం మ్యానిఫెస్టో హామీ ప్రకారం ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరించాలని హరీశ్ డిమాండ్ చేశారు. వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని, పారిశుద్ధ్య కార్మికులలకు వేతనాలు వెంటనే చెల్లించాలని, నిరుడు నవంబర్‌లో నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వే డాటా ఎంట్రీ ఆపరేటర్లకు వేతనాలు వెంటనే విడుదల చేయాలని లేఖలో డిమాండ్ చేశారు.

# నాన్-ట్యాక్స్ ఆదాయం పెంపుపై దృష్టి చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ సభ్యులైన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు.

గత ప్రభుత్వ పథకాలను ఒకటి కూడా ఆపకుండా కొత్తగా రూ.33,600 కోట్లతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు భట్టి చెప్పారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ కానుక, మహాలక్ష్మి, ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇండ్లు సహా పలు కొత్త పథకాలను ప్రవేశపెట్టినట్టు తెలిపారు. బడ్జెట్ నిధుల్లో కొన్ని శాఖలకు అధికంగా, మరికొన్ని శాఖలకు తకువగా అందుతున్నాయయని పేర్కొంటూ.. అన్ని శాఖలకు సమానంగా నిధులు పంచాలని అధికారులను ఆదేశించారు. ఖర్చుల్లో శాఖల మధ్య అంతరాలను తగ్గించి అన్నింటిని ఒకే స్థాయిలోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న మేజర్ ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమానంగా అభివృద్ధి చెందితేనే.. రాష్ట్రం సమగ్రంగా ముందుకెళ్తుందని చెప్పారు. రానున్న పది రోజుల్లో రేషనలైజేషన్ ప్రక్రియను పూర్తిచేసి, సమగ్రంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.



# నక్సలిజం అంతం అయ్యే వరకు ఆపరేషన్ కొనసాగుతుంది

(మొదటి పేజీ తరువాయి)

చర్చల ప్రసక్తే లేదన్న మంత్రి.. అడవుల్లో ఉన్న మావోయిస్టులంతా ఆయుధాలు వదిలి జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని, అభివృద్ధికి కలిసి రావాలని పిలుపునిచ్చారు.

చత్తీస్‌గఢ్‌లోని నవా రాయ్‌పూర్ అటల్ నగర్‌లో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ(ఎన్ఎఫ్ఎస్‌యూ)కి ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే సెజ్‌బహార్‌లోని ఎన్ఎఫ్ఎస్‌యూ ట్రాన్సిట్ క్యాంపస్‌ను, ఛత్తీస్‌గఢ్‌లోని ఐ-హబ్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం షా మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి చివరికల్లా నక్సలిజాన్ని అంతం చేస్తామని పునరుద్ఘాటించారు.

ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిసిపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను కూడా అమలు చేస్తామన్నారు. అవసరమైతే అంతకన్న ఎక్కువ సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంలను పూర్తిగా అమలుతో మన దేశ నేర న్యాయ వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత ఆధునిక, వేగవంతమైన, శాస్త్రీయ న్యాయ వ్యవస్థగా మారుతుందని షా అన్నారు.



నవ రాయ్‌పూర్‌లోని ఎన్ఎఫ్ఎస్‌యూ క్యాంపస్‌కు రూ. 145 కోట్లు, సీఎఫ్ఎస్‌ఎల్‌కు రూ. 123 కోట్లు ఖర్చవుతుందని, ఇవి మూడు సంవత్సరాలలో అందుబాటులోకి వస్తాయన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికత ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక, ఆర్థిక పురోగతిపైనే కాకుండా సకాలంలో న్యాయం అందించడంపైనా దృష్టి పెడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రులు అరుణ్ సావో, విజయ్ శర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.








# ప్రతి ఇల్లు క్రీడల్లో భాగస్వామ్యం కావాలి

- మైదానం ఉంటేనే కళాశాలలకు అనుమతి ఇవ్వాలి
- ప్రతి పాఠశాలలో పిఇటిలను నియమించాలి
- రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి
- ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తుల బదులు మంచి ఆరోగ్యాన్ని ఇచ్చేందుకు ప్రతి ఇల్లు క్రీడల్లో భాగస్వామ్యం కావాలని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా ఒలింపిక అసోసియేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి పిలుపునిచ్చారు.

ఈ మేరకు హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం జరిగిన 39వ ఒలింపిక్ డే రన్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాఘవ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి క్రీడల పట్ల ఆకర్షితులయ్యేందుకు పాఠశాల దశ కీలక మని దురదృష్టవశాత్తు అన్ని పాఠశాలలు,కళాశాలలకు కనీస మైదానాలు లేకపోవడం శోచనీయమన్నారు.

మైదానాలున్న విద్యాసంస్థలకు మాత్రమే అనుమతిస్తూ వ్యాయామ విద్య ఉపాధ్యాయులు తప్పనిసరిగా నియమించుకునేలా ఆదేశాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి గారి కోర నున్నట్లు చెప్పారు.గత ప్రభుత్వం క్రీడా రంగాన్ని నిర్లక్ష్యాన్ని గురి చేసిందని స్వతహాగా క్రీడాకారుడైన సీఎం నేతృత్వంలో క్రీడాకు పెద్దపీఠ వేస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు మహ్మద్ అజీజ్ ఖాన్ మాట్లాడుతూ ఒలంపిక్ సృష్టికర్త క్యుబర్టీన్ అందించిన ఒలింపిక్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ క్రీడల్లో భాగస్వాములు కావాలన్నారు.

ఒలంపిక్ ఆవిర్భావం, క్రమానుగతంగా వచ్చిన మార్పులను వివరించారు. ఒలింపిక్ స్ఫూర్తితోనే దేశాల మధ్య రాచరిక ఆదిపత్యం బదులు స్నేహ సౌభ్రాతృత్వం వెల్లువిరిసిందన్నారు.

ఆస్తులు వెంబడి పరిగెడితే ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని జీవిత చరమాంకంలో సంపాదించిన డబ్బులు ఆసుపత్రులకు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు.ఈ విధానాన్ని రూపుమాపేందుకు సర్వత్ర ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

జిల్లాలోని అన్ని క్రీడా సంఘాల సహకారంతో ప్రతి ఏడాది నగరంలో ఒలింపిక్ డే రన్ విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

హనుమకొండ జిల్లా క్రీడలు యువజన అధికారి గుగులోతు అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజా ప్రతినిధులు అధికారుల సహకారంతో క్రీడా మౌళిక సదుపాయాలలో జిల్లా గణనీయ అభివృద్ధి సాధించినట్లు చెప్పారు.

వేసవి క్రీడా శిక్షణలో పొందిన స్ఫూర్తితో నిత్యం స్టేడియంకి వచ్చే క్రీడాకారులు,తల్లిదండ్రుల సంఖ్య పెరగడం సంతోషదాయకం అన్నారు. కాళోజీ కూడలిలో ఒలింపిక్ డే రన్ ను జంగా రాఘవరెడ్డి , అజిజ్ ఖాన్ లు జెండా ఊపి ప్రారంభించారు.

కాలేజీ జంక్షన్ నుండి అంబేద్కర్ చౌరస్తా, ఏషియన్ మాల్ మీదుగా స్టేడియం వరకు దాదాపు 600 మంది రన్ కొనసాగింది. అతిథులు క్రీడాజ్యోతిని చేతబూని ఉత్సాహంగా రన్ లో భాగస్వాములయ్యారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్లు ,... కాంగ్రెస్ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వివిధ క్రీడ సంఘాల బాధ్యులు సారంగపాణి, ఎస్. పవన్ కుమార్,పి. రమేష్ రెడ్డి, తోట శ్యాం ప్రసాద్,మహ్మద్ కరీం, సృజన్ కాంత్, బిన్ని లక్ష్మణ్,రామప్ప స్పోర్ట్స్ అథారిటీ కోచ్ లు వ్యాయామ విద్య ఉపాధ్యాయులు,వాకర్స్ క్రీడాకారులుపాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో దళిత, గిరిజన, కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనం

- మంత్రికి సమస్యలపై వినతులు, త్వరిత పరిష్కార మంత్రి హామీ


**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

బంజారా హిల్స్‌లోని బంజారా భవన్‌లో ఆదివారం దళిత, గిరిజన, కార్మిక, ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మైనింగ్,కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి జి.వివేక్ మాట్లాడుతూ, దళితులు, గిరిజనులు, కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, కార్మికుల సంక్షేమం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను మంత్రికి వినిపించగా, వాటిని సానుకూలంగా పరిగణించి త్వరితంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, దళిత, గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## కావూరి దంపతుల షష్టిపూర్తి శాంతి మహోత్సవానికి హాజరైన మంత్రి వివేక్

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఆదివారం కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు, హేమలత దంపతుల షష్టిపూర్తి శాంతి మహోత్సవం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మైనింగ్,కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి జి.వివేక్ మాట్లాడుతూ, "షష్టిపూర్తి శాంతి వేడుకలు భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానాన్ని కలిగి ఉన్నాయి. ఇవి వ్యక్తిగత స్థాయిలో శాంతి, ఆరోగ్యం, కుటుంబ ఐక్యతకు మార్గదర్శకంగా నిలుస్తాయి. కావూరి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు ఆరోగ్యంగా, సంతోషంగా, సేవా మార్గంలో కొనసాగాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

కావూరి సాంబశివరావు సమాజానికి చేసిన సేవలను, ఆయన ప్రజాప్రతినిధిగా సుదీర్ఘకాలం కొనసాగిన దశలను మంత్రి ప్రత్యేకంగా గుర్తు చేశారు. ఈ వేడుకలో పలువురు రాజకీయ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలి

- ఆర్ట్స్ కళాశాల లో మొక్కల నాటే కార్యక్రమం
- పచ్చదనానికి ప్రారంభమైన వేదిక

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు, హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పిల్లలు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, టీజీ ఎన్‌బీ శాఖ, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి.

ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి జయంతి గారు అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ - "పచ్చని ప్రకృతిని కాపాడటం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి. అలాగే యువత చెడు వ్యసనాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి" అని పేర్కొన్నారు.

టీజీ ఎన్‌బీ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ గారు మాట్లాడుతూ, "డ్రగ్స్ పట్ల యువతలో సరైన అవగాహన పెరగాలి. డ్రగ్స్ అనే మహమ్మారిని అంతమొందించేందుకు యువత ముందుండాలి" అని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్ గారు మాట్లాడుతూ, "డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేస్తాయి. విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని నిష్టతో ముందుకు సాగాలి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎన్‌బీ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ గారు మరియు సిబ్బంది, ఎక్సైజ్ శాఖ ఎస్ఐ తిరుపతి గారు, ఎన్సీసీ లెఫ్టినెంట్ స్వామి గారు మరియు సిబ్బంది , కళాశాల లెక్చరర్ నహేద గారు, నర్సింగ్ ఆఫీసర్ అరుణ కుమారి గారు, డీసీపీఓ ఇంచార్జ్ ప్రవీణ్ గారు, ఎఫ్ఆర్ఓ రవి కృష్ణ గారు, విమెన్ హబ్ కోఆర్డినేటర్ కల్యాణి గారు, సఖి అడ్మిన్ హైమవతి గారు, నషా ముక్త్ భారత్ అభియాన్ కోఆర్డినేటర్ తేజస్విని గారు, జిల్లా సంక్షేమ కార్యాలయ సిబ్బంది రాజేష్ గారు, రజిత గారు, మానస గారు స్వర్ణలత గారు, కళాశాల ఎన్సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు డ్రగ్స్ వ్యతిరేకంగా యువతలో చైతన్యం పెంచే ప్రయత్నం జరిగింది.









## రేణుక హత్య ఉదాంతం పై వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలం గట్ల ఖానాపురం లో ఇటీవల జరిగిన రేణుక హత్య ఉదాంతానికి సంబంధించిన వివరాలను వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తెలుసుకున్నారు.ఆదివారం గట్లకానాపురం గ్రామంలోని బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి వారితో మాట్లాడారు.గతంలోనే భర్త చనిపోయిన రేణుక నేడు హత్యకు గురికావడం వారి సంతానం ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు మొత్తం ఐదు మంది అనాథలు అయ్యారని వారిని ఆదుకోవాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వారికి అన్నదండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దమందలు మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, తాజా మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచ్ బాలనాగయ్య, మాజీ ఎంపిటిసి దామోదర్,మాజీ సర్పంచ్ వెంకటేష్, మహేష్, మణిగిల్ల శివ, ఎస్సై శివకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదానికి గురైన వెల్టూర్ ఆంజనేయులు ను పరామర్శించిన ఎమ్మెల్యే

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న ఆంజనేయులును ఎమ్మెల్యే మెగా రెడ్డి పరామర్శించారు. ఆదివారం వెల్టూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రామచంద్రయ్య గారి మనవడు ఆంజనేయులు ను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.ఇప్పటికే చికిత్స నిమిత్తం రూ. 2లక్షల 50 వేల విలువగల ఎల్ఓసి అందజేశామని ఇకపైన ఏదైనా వైద్య సేవలు అవసరమున్న తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దమందలు మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, తాజా మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచ్ బాలనాగయ్య, మాజీ ఎంపిటిసి దామోదర్, మాజీ సర్పంచ్ వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

- రాజోలి ఎస్సై గోకారి

**రాజోలి,తెలంగాణ ముచ్చట్లు:**

రాజోలి మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యల భాగంగా పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వ్యక్తులపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ సందర్భంగా ఎస్సై గోకారి మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్ మరియు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిని కూడా ఆపి అవగాహన కల్పించారు. తనిఖీల్లో మద్యం సేవించినట్లు గుర్తించిన వారిపై కేసులు నమోదు చేసి, వారి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించకపోతే ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ చట్టానికి అనుగుణంగా వ్యవహరించాలని ఎస్సై కోరారు.




## ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం - అవగాహన ర్యాలీ

- ఇన్‌స్పెక్టర్ మోహన్ బాబు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో యువత భాగస్వామ్యం కావాలని ఖమ్మం త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ మోహన్ బాబు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఖమ్మం త్రీ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రకాష్ నగర్ లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ సమగ్ర అవగాహన అవసరమని అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం అనేది వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబం, సమాజం మరియు దేశం పైన కూడా ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుందని అన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా నైతిక విలువలు అలవర్చుకొని ఉజ్వలభవిష్యత్తుకు పునాది వేయాలని అన్నారు. కార్యక్రమంలో టీజిఎన్ ఏ బి ఎస్సై రవిప్రసాద్ పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# మాదిగ సమాజం తరఫున కార్మిక శాఖ మంత్రికి సన్మానం

- **హైదరాబాద్‌లో సతీష్ మాదిగ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మంత్రి జి.వివేక్‌కు మాదిగ సమాజ ప్రతినిధులు ఘనసన్మానం చేశారు. ఈ కార్యక్రమం సోమాజిగూడలోని మంత్రి నివాసంలో సతీష్‌మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కార్మిక హక్కుల పరిరక్షణ, గనుల అభివృద్ధి, శ్రమ జీవుల సంక్షేమం కోసం మంత్రి నిర్వహిస్తున్న కృషిని గుర్తించిన మాదిగ సమాజం తరపున ఈ సన్మానం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు .ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, “కార్మికుల అభ్యున్నతికి, పేదల సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తాను. మాదిగ సమాజ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటాను” అని పేర్కొన్నారు.కార్యక్రమంలో మాదిగ సంఘాల నాయకులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, సామాజిక రంగానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# కార్మిక వర్గ ఐక్యతా పోరాటమే ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ విధానం

- **ఆర్టీసీ పరిరక్షణ,కార్మిక వర్గ హక్కులు సౌకర్యాల కోసం పోరాటాలకు సిద్ధం కండి**
- **సిఐటియు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపు**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**





ఆర్టీసీ కార్మికుల ఐక్యతకు వారధిగా పోరాటాల సారథిగా,కార్మిక వర్గ ఐక్యత పోరాటం నినాదమే ఎస్ డబ్ల్యూ ఎఫ్ విధానమని, కార్మికులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని, ఆర్టీసీ కార్మిక వర్గానికి నష్టం కలిగించే ప్రభుత్వ యాజమాన్య విధానాలకు వ్యతిరేకంగా నికరంగా పోరాడే సంఘం ఎస్ డబ్ల్యూ ఎఫ్ మాత్రమేనని భారత కార్మిక సంఘాల కేంద్రం (సిఐటియు) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలోని నేపాల్ దేవ్ భట్టాచార్య నగర్,యర్రా శ్రీకాంత్ ప్రాంగణం (ఐఎంఏ హాల్)లో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాలుగవ రాష్ట్ర మహాసభల రెండో రోజు పాలడుగు భాస్కర్ ప్రధాన వక్తగా గా పాల్గొన్నారు. ఆర్టీసీలో సుదీర్ఘకాలం సాగిన 55 రోజుల సమ్మెలో ఆర్టీసీ ఉద్యమానికి సిఐటియు అండగా నిలిచిందన్నారు ఆర్టీసీని పరిరక్షించే సాధనం ఐక్యతా పోరాటమే అని ఆ నినాదం మనదే అని ఇప్పుడు అందరి నోటా ఐక్యపోరాటాల వర్ధిల్లాలి అనే నినాదం వస్తుందని పేర్కొన్నారు.ఆర్టీసీ కార్మికులు అనుభవిస్తున్న కష్టాలు,ఆర్టీసీ ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ,ఔట్సోర్సింగ్ విధానాలు,ఎలక్ట్రికల్ బస్సులు,పెరిగిన పనిభారాలు అన్నీ కూడా ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల ఫలితమే అన్నారు. కార్మికుల సంక్షేమంగానీ,వేతనాల గురించి గానీ,పని గంటల గురించి గానీ ప్రభుత్వాలు, యాజమాన్యాలు ఆలోచించడం లేదన్నారు. కార్మిక సంఘాలు లేని ప్రపంచం, కార్మిక సంఘాలు లేని భారతదేశం కోసం ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయన్నారు. స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ పాలకులనే ఎదిరించి పోరాడిన కార్మిక వర్గం భారతదేశంలో ఉందని ఆస్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా కార్మికవర్గం చేస్తున్న సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ కార్మిక వర్గం సంపూర్ణంగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ఉమెన్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్వీ రమ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళల సౌకర్యాల గురించి మహిళా హక్కుల గురించి చర్చించాలని శ్రామిక మహిళలకు అండగా నిలవాలని మహిళలు పోరాటాలకు రావాలని పిలుపునిచ్చారు. రెండు రోజులపాటు జరిగిన స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాలుగవ మహాసభలో ఏఐఆర్ టి డబ్ల్యూ ఎఫ్ జాతీయ కార్యదర్శి అర్ముగనాయర్ ఆంధ్రప్రదేశ్ ఎస్ డబ్ల్యూ ఎఫ్ కోశాధికారి దివాకర్ సౌహార్ధ సందేశం ఇచ్చారు. ఆర్టీసీ కార్మికులపై పెంచిన పనిభారాలు తగ్గించాలని,రిటైర్ అయిన కార్మికులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని,మహిళా ఉద్యోగులకు పని ప్రదేశాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని, మహాలక్ష్మి స్కీం నేపథ్యంలో వస్తున్న సమస్యలు పరిష్కరించాలని, ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ విధానాలకు స్వస్తిపలికి రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, ప్రయాణికుల రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని ,రిటైర్డ్ ఉద్యోగులకు ఏపీ తెలంగాణ రెండు రాష్ట్రాల్లో ప్రయాణించే విధంగా సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి బస్సు పాసులు మంజూరు చేయాలని, తదితర 12 తీర్మానాలను మహాసభలో చర్చించి పలు సవరణలతో ఏకగ్రీవంగా ఆమోదించారు.

నూతన రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికతో ముగిసిన ఈ మహాసభలో రాష్ట్రంలోని వివిధ డిపోలకు చెందిన 183 మంది ప్రతినిధులు హాజరై కార్యదర్శి నివేదిక తీర్మానాలపై విస్తృతంగా చర్చల్లో పాల్గొన్నారు. భవిష్యత్తు పోరాటాలకు సంబంధించి పలు తీర్మానాలను ఆమోదించారు.మహాసభల జయప్రదం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికి ఆహ్వాన సంఘం తరఫున కళ్యాణ వెంకటేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. మహాసభల్లో తమ గళం ద్వారా పాటలతో అలరించిన ప్రజానాట్యమండలి సదానందం బృందానికి ఎస్ఎఫ్ఐ,డివైఎఫ్ఐ,ఏఐ ఆర్ టి డబ్ల్యూ ఎఫ్ ఖమ్మం జిల్లా నాయకత్వానికి ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పిట్టల సుధాకర్ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పిట్టల సుధాకర్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ గడ్డం లింగమూర్తి, ఆర్టీసీ శ్రామిక మహిళ కమిటీ రాష్ట్ర నాయకులు జిల్లా పద్మావతి,ఖమ్మం రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు ,గుగ్గిళ్ళ రోశయ్య, పగిళ్లపల్లి నరసింహారావు,గడ్డం వెంకటయ్యవీ.రమేష్, బుగ్గవీటి లింగమూర్తి, భాగ్యలక్ష్మి,మల్లికాంబ,పద్మ, విజయలక్ష్మి,సరితసీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి సమస్యల పట్ల ఎన్ ఎస్ యు ఐ నిరంతరం పోరాటం చేయాలి

- **వెంకట్ స్వామి**
- **తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు రాష్ట్ర ఎన్ఎస్ యు ఐ విభాగం అధ్యక్షులకు రాష్ట్ర టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి మండల్ ఎన్ఎస్ యు ఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్ ఆధ్వర్యంలో విద్యార్థి సమస్యల పట్ల ఎన్ ఎస్ యు ఐ విభాగం ఏ విధంగా పనిచేయాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ..

కాంగ్రెస్ పార్టీ విద్యార్థి దశ నుంచే విద్యార్థి ఆర్గనైజేషన్ ఉండి విద్యార్థి సమస్యలను పట్ల పోరాటం చేయాలని ఉద్దేశంతో ఎన్ఎస్ యు ఐ ని చేర్చడం జరిగింది. భారతదేశ యువత ఉజ్వల భవిష్యత్తు కోసం ఎన్ ఎస్ యు ఐ విభాగం నిరంతరం పనిచేస్తుందని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వందాదాపుగా విద్యార్థి సమస్యలు తలెత్తకుండా పరిపాలన కొనసాగిస్తుందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి మండల్ ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, జిల్లా ఎఐపిసి ఉపాధ్యక్షులు నాగార్జున, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సమద్ మియా,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబా, కోళ్లవెంకటేష్, అబ్దుల్లా, విజయ బాబు, తదితరులు పాల్గొన్నారు.





# ప్రజా సంక్షేమమే నా ధ్యేయం

- **కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్**

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా ప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్యే నివాస కార్యాలయాన్ని సందర్శించి, పలు వినతి పత్రాలు, ఆహ్వానాలు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే తన పనితీరు యొక్క పరమావధిగా ఉన్నదని, నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడైనా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలి

**-మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**
**-బీఆర్ఎస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ సమీక్ష సమావేశం**

**తొర్రూరు,తెలంగాణ ముచ్చట్లు:**

పాలకుర్తి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమీక్ష సమావేశం తొర్రూరు మండల కేంద్రంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. గతంలో పార్టీ అధికారంలో ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోయిందని, రైతులకు భరోసా అందజేస్తున్న పేరుతో మధ్యలో రెండు సార్లు ఆ సాయం నిలిపివేసిన విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. తాము నిర్వహించిన రైతు బంధు వంటి పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు గుర్తు చేసేలా ప్రచారం చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు, జిల్లా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా బృందం సభ్యులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

- **బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కురుసపెల్లి రమేష్**

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**



హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు కురుసపెల్లి రమేష్ మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఇప్పటి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలను ప్రజలకు హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆయన అన్నారు.ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానని కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, అంతే కాకుండా మహిళలకు రూ.2500 నగదు, స్కూటీలు, ఉచిత గ్యాస్, పెన్షన్లు రూ.4000 చొప్పున ఇస్తామని ప్రకటించినా, వాటిలో ఏ హామీ కూడా పూర్తిగా అమలవలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు తమ ఓటుతో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని, బీఆర్ఎస్ అభ్యర్థుల విజయాన్ని సునిశ్చితం చేయాలని ఆయన అన్నారు.


# సోమదేవరపల్లిలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఏర్పాటైయింది

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**

ధర్మసాగర్ మండలంలోని సోమదేవరపల్లి గ్రామంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జూలై 7న జరగనున్న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రాథమిక ఏర్పాట్లలో భాగంగా గ్రామస్థాయిలో నూతన కమిటీని ఎన్నిక చేశారు.

**ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్,** ఎమ్మెస్పీ మండల ఇంచార్జ్ గంగారపు శ్రీనివాస్ మాదిగ,నాయకులు కొట్టె శంకర్ మాదిగ, మండల సీనియర్ నాయకులు కుక్క పౌలు మాదిగ, నమిండ్ల ప్రభుదాస్ మాదిగ, గబ్బెట శ్రీనివాస్ మాదిగ, తదితరుల ఆధ్వర్యంలో గ్రామస్తులు సమావేశమయ్యారు.కమిటీ ఎన్నిక అనంతరం గ్రామంలో ఎం.ఆర్.పి.ఎస్ జెండా గద్దె నిర్మాణానికి శుభారంభంగా ముగ్గు వేసి పనులను ప్రారంభించారు. కమిటీ అధ్యక్షునిగా నమిండ్ల సుమన్ మాదిగ, గౌరవ అధ్యక్షునిగా గబ్బెట శ్రీనివాస్ మాదిగ, అధికార ప్రతినిధిగా గబ్బేట అరవింద్ మాదిగను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా కుక్క చార్లెస్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కుక్క శ్రీనివాస్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా కుక్క అశోక్ మాదిగ, సహాయ కార్యదర్శిగా కుక్క శ్రీనివాస్ మాదిగ, సలహాదారునిగా గబ్బేట ప్రేమ్ మాదిగ బాధ్యతలు చేపట్టారు.

కమిటీ సభ్యులుగా గబ్బేట రవి మాదిగ, గబ్బేట బాలరాజు, కుక్క ప్రవీణ్, కుక్క నవీన్, ఎన్. అరుణ్, కుక్క రాజేష్, కుక్క మహేష్, కుక్క సుకుమార్ తదితరులు ఎంపికయ్యారు.గ్రామస్థాయిలోని సంఘం పటిష్టంగా పనిచేయాలని, సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలనే ఉద్దేశంతో ఈ కమిటీని ఏర్పాటుచేశారు.





తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
సోమవారం-23- జూన్ 2025
వరంగల్


# జీవవైవిధ్య నెలవులు వర్షా రణ్యాలు

హరిత వృక్షాలకు నెలవులు, జీవకోటి తావులు, పర్యావరణహిత సేవలు చేస్తున్న వర్షారణ్యాలు లేదా రెయిన్ ఫారెస్టులు ప్రపంచ మానవాళి మనుగడకు అమూల్య సేవలు అందిస్తున్నాయి. నేలలో తేమ పునాదులుగా నిత్యం పచ్చని పందిరిలను పరుస్తున్న వర్షారణ్యాలు వివిధ వృక్ష జంతు చిరునామాలుగా నిలుస్తున్నాయి. కార్చిచ్చులకు తావులేని వర్షారణ్యాలు తరతరాలుగా మానవ జీవితాలకు నీడగా నిలుస్తూ, భూమాతను కాలుష్యం నుంచి కాపాడుతూ ఎనలేని సేవలను చేస్తున్నాయి. వర్షారణ్యాల ప్రాధాన్యాన్ని గుర్తించిన అంచర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట 22 జూన్ రోజున "ప్రపంచ వర్షారణ్యాల దినోత్సవం (వరల్డ్ రెయిన్‌ఫారెస్ట్ డే)"ను పాటించడం ఆనవాయితీగా మారింది. వర్షారణ్యాలను కాపాడుకోవడం, రక్షణ గొడుగులు పట్టడం మన కనీస కర్తవ్యం కావాలి. భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకర వాతావరణం, జీవ వైవిధ్యం అందించడానికి నేడే కార్యాచరణకు పూనుకోవాలి. అడవుల నరికివేతను నిషేధించడం, అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడం, సుస్థిర ప్రణాళికలు అమలు చేయడం విధిగా జరగాలి. వర్షారణ్యాల్లో అపార పక్షులజాతులు, వైవిధ్య జంతు జాతులు, విలువైన వృక్ష సంపద దాగి ఉంటాయి. మానవాళికి సురక్షిత తాగునీరు అందించే నెలవులుగా వర్షారణ్యాలు పని చేస్తున్నాయి. గాలిలో కార్బన్ డై ఆక్సైడ్‌ను తగ్గించడం, భూమాత రక్షణకు చేయూతనివ్వడం, ప్రతికూల వాతావరణ మార్పులను కట్టడి



చేయడం, విలువైన ఔషధాలను అందించడం, కలపను అందించడం, మాంసానికి తావులు, పర్యాటకానికి ఊతమివ్వడం, పోషకాహారాన్ని అందించడం, నేల సారాన్ని పెంచడం, సాంస్కృతిక ప్రదేశాలుగా నిలవడం, ఆహార భద్రతకు చేయూతనివ్వడం, జీవ వైవిధ్య పరిరక్షణ, కార్గన్ ఉద్గారాలను తగ్గించడం, మిలియన్ల కుటుంబాలకు జీవనోపాధులను కల్పించడం లాంటి పలు ప్రయోజనాలను వర్షారణ్యాలు కల్పిస్తున్నాయి. 2017లో ప్రారంభమైన ప్రపంచ వర్షారణ్యాల దినోత్సవం వేదికగా మానవాళి ఆరోగ్యానికి ఉపకరిస్తున్న వర్షారణ్యాలను కాపాడుకుంటూనే, జీవకోటి మనుగడకు ఊపిరులూదుతూ పటిష్ట అడుగులు పడాలి. 2025 ప్రపంచ వర్షారణ్యాల దినం ఇతివృత్తంగా "అడవులు ఆహారం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. మన చుట్టుపక్కల ఉన్న వర్షారణ్యాలను కాపాడుకుంటూ, వాటితో కలిసి సహజీవనం చేయడం మన జీవనశైలిలా భాగం కావాలి. వర్షారణ్యాలకు వనభోజనాలా లేదా పర్యాటకాలకు ప్రణాళికలు వేద్దాం.

# ఆరుద్రపురుగు ఎరువుల వాడకంతో కనుమరుగు

దేవతలకు, వరుణ దేవుడికి ప్రతిరూపంగా, తమకు శుభ సూచకంగా రైతులు భావించే, ఆరుద్ర పురుగులు క్రమేపీ కనుమరుగు అవుతున్నాయి.. ఆరుద్ర నక్షత్రములలో ఆరవది. రాశి చక్రములలో, "ఆరుద్ర" నక్షత్రం యొక్క నాలుగు పాదములు, "మిధున (జెమిని) రాశికి చెందుతాయి. వ్యవసాయ పనులు ప్రారంభించ దానికి, "ఆరుద్ర కార్తె" అనుకూలమైనది. ఈ కార్తెలో మాత్రమే కనబడేది ఆరుద్ర పురుగు. ఇది మొఖమల్ బట్టను చుట్టుకున్నట్లుగా ఉండి, ఎర్రగా బుర్రగా, బొద్దుగా ఉంటుంది. అందంగా ఉండే ఈ పురుగు పంటలకు ఎలాంటి హానీ చేయదు. ఏడాదికి ఒకసారి మాత్రమే ప్రత్యక్షమౌతుంది. "ఇట్టే వచ్చి, అట్టే మాయమౌతావు, ఆరుద్ర పురుగుకు మల్లే." అని తెలుగు నాట, ఒక జాతీయము మిగుల ప్రాచుర్యములో ఉంది. ఆరుద్ర పురుగును కొన్ని చోట్ల "పట్టు పురుగు" అనీ, "చందమామ పురుగు " అనీ, "లేడీ బర్డ్" అనీ, "ఇంద్రగోప పురుగు" అని కూడా అంటారు. ఇలా చాలా పేర్లను కలిగి ఉన్న ఈ పురుగు చూడటానికి అరంగుళం సైజులో ఉండి, ఎర్రని మఖ్మల్ బట్టతో చేసిన బొమ్మలాంటి పురుగులా ఉంటుంది. ముట్టుకుంటేనే అత్తిపత్తి చెట్టు ఆకుల్లా ముడుచుకు పోయే స్వభావం ఉన్న ఈ పురుగులు నేలమీద, కొన్నిచోట్ల ఇసుక నేలల్లో, పచ్చగడ్డి కాసింత ఉన్న చోట్లలో, విరివిగా కనిపిస్తాయి. ఈ అందమైన, మెత్తనైన పురుగులు వర్షాకాలం తొలకరి వర్షాలు కురవగానే, బిల బిల మంటూ కుప్పలు కుప్పలుగా కనిపిస్తాయి. బీడువారిన నేలపై తొలకరి జల్లులు పడగానే, బిలబిలమంటూ ఆరుద్ర పురుగులు నేలపైకి వస్తాయి. అలా ఆరుద్ర పురుగులు నేలపై కనిపిస్తే ఆ సంవత్సరం వర్షాలు ఎక్కువగా కురుస్తాయనీ, రైతన్నలు వ్యవసాయం చేసుకోవచ్చని అంటారు. ఆరుద్ర పురుగులకు రైతులకు అవినాభావ సంబంధం ఉంది. వీటిని ఏ రైతు చంపడు, ఎవ్వరినీ చంపనీయడు... వ్యవసాయ పనులు మొదలు పెట్టేందుకు ఆరుద్ర కార్తె అనుకూలమైంది. ఈ కార్తెలో



మాత్రమే కనబడే అరుదైన పురుగు ఆరుద్ర. అందుకే దాన్ని "ఆరుద్ర పురుగు " అంటారు. ఇవి ప్రకృతి నేస్తాలు. చూడముచ్చటగా ఉండే ఆరుద్ర పురుగు ఆగమనాన్ని రైతులు "శుభసూచకం"గా భావిస్తారు. ఇక వ్యవసాయం పనులు మొదటు పెట్టుకోవచ్చని ఆనందంగా పొలాలకేసి మళ్లుతారు. గ్రామాల్లో ఈ పురుగులు కనిపించాయంటే రైతులు సంతోషంతో గంతులేస్తారు. ఆరుద్ర పురుగుల దర్శనంతో, ఆ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు పడుతాయని సంకేతం. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండుతాయనే ధీమా రైతుల్లో నెలకొంటుంది. ఇసుక నేలల్లో, బొరియలు చేసుకుంటూ, అందులోనే జీవిస్తూ, తొలకరి వర్షాలకి బయటకి వస్తాయి. ఇవి నేలలోని సూక్ష్మ క్రిముల్ని పట్టి తింటూ, రైతులకి మేలు చేస్తాయి. ఇవి అలా బయటకి వచ్చినప్పుడు వర్షానికి. తడిసిన నల్లని భూమి మీద, ఆకుపచ్చని గీతల్లాంటి గడ్డి మీద ఎర్రని చుక్కలు అద్దినట్లుగా కనిపిస్తాయి. ఆ దృశ్యం ఎంతో హృద్యముగా ఉంటుంది. ఇవి మృదువుగా వుండి ముట్టుకుంటే వెల్వెట్ వస్త్రంలా మెత్తగా అనిపిస్తాయి. చూడగానే పట్టుకోవాలని అనిపించెంతగా, ముద్దుగా అందంగా కదిలే బొమ్మల్లా ఉంటాయి. పురుగులంటే భయపడే చిన్న పిల్లలు సైతం ఈ ఆరుద్ర పురుగుల్ని పట్టుకుంటారు. ముట్టుకుంటే చాలు అవి ముడుచుకుంటాయి. కొంత సేపటికి, ఏ కదలికా లేకుండా ఉంటే మెల్లగా నడవడం మొదలు పెడతాయి. అయితే ఆరుద్ర పురుగులు నెమ్మదిగా అంతరించే దశకు చేరుకుంటున్నాయి. పొలాల్లో మితిమీరిన క్రిమిసంహారక మందులు వాడకం దీనికి ముఖ్య కారణం. ఈమధ్య కాలంలో మరో ప్రమాదకరమైన ధోరణి ఛత్తీస్ గడ్ మరియు తెలుగు రాష్ట్రాల్లో చోటు చేసుకుంటున్నది. ఈ పురుగుల్ని కిలోల లెక్కన కొనే ఏజెంట్లు బయలు దేరారు. వీటి నుంచి సేకరించే నూనెను పక్షవాతం రోగులకు వాడే తైలం లోనూ, లైంగిక సామర్థ్యాన్ని పెంచే ఆయుర్వేద మందుల తయారీలోనూ వాడుతున్నారని చెపుతారు. అరబ్ దేశాలలో కూడా ఈ పురుగుల్ని వాడుతారు. మనిషి వెదజల్లుతున్న కాలుష్యం, పురుగుల మందుల వల్ల ఊరపిచ్చుకల, మరికొన్ని జీవాల వలే, ఇవి కూడా కనిపించకుండా పోయే పరిస్థితులు నెలకొన్నాయి.

# ఎయిరిండియా కష్టాల పరంపర

చూడబోతే ఎయిరిండియాకు కష్టాలన్నీ ఒక్కసారే కట్టగట్టుకుని వచ్చినట్టున్నాయి. ఈ నెల 12న గుజరాత్‌లో జరిగిన దురదృష్ట ఘటనలో 272 మంది మరణించిన తర్వాత ఎయిరిండియా విమానాలు ఎక్కాలన్నా, ప్రత్యేకించి ప్రమాదం సంభవించిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ రకం విమానాల్లో ప్రయాణించాలన్నా చాలామంది భయపడుతున్నారు. అందుకు తగినట్టే ఆ సంస్థ అంతర్జాతీయ, దేశీయ మార్గాల్లో వినియోగించే దాదాపు 90 విమాన సర్వీసుల్ని అంచెలంచెలుగా రద్దుచేస్తూ పోతోంది.
శుక్రవారం కూడా ఎనిమిది విమానాలు రద్దయ్యాయి. నిర్వహణాపరమైన, సాంకేతికమైన సమస్యల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు సంస్థ చెబుతోంది. వీటికితోడు పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇరాన్ గగనతలాన్ని మూసివేయటం వంటివి కూడా విమాన సర్వీసుల రద్దుకు దోహదపడ్డాయి. జూలై రెండో వారం వరకూ అంతర్జాతీయ విమాన సర్వీసులు 15 శాతంమేర తగ్గించనున్నామని ఎయిరిండియా ప్రకటించింది. ప్రయాణికులు కూడా ఏమంత భరోసాతో లేరు. అసలు విమానయానమే వద్దనుకున్నవారు కొందరైతే, బోయింగ్ విమానాలు ఎక్కరాదని మరికొందరు నిర్ణయించుకుని ప్రయాణాలు రద్దుచేసుకున్నారు.
విమానయాన సంస్థలను నియంత్రించే పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) ఎయిరిండియా విమానాల్లో భద్రతకు సంబంధించిన ప్రధాన లోపాలేమీ లేవని, కేవలం నిర్వహణాపరమైన సమస్యలే ఉన్నాయని చెబుతోంది. భిన్న విభాగాల మధ్య సమన్వయం అవసరమవుతుందని సలహా ఇచ్చింది. ఎక్కడ ఏ చిన్న లోపాన్ని గమనించినా దాన్ని నమోదు చేయటం, వెనువెంటనే సరిదిద్దటం వంటివి జరగాలని సూచించింది.
ఎయిర్‌లైన్స్ సంస్థలకు రేటింగ్ ఇచ్చే అంతర్జాతీయ స్వతంత్ర ఆన్‌లైన్ సంస్థ పరిశీలనలో ఇండిగో, ఆకాశ సంస్థలు ఏడు అంశాల్లో ఆరు పాయింట్లు సాధించాయి. స్పైస్ జెట్ ఏడుకు ఏడు పాయింట్లు పొందగా, ఎయిరిండియా కేవలం నాలుగు పాయింట్లే సాధించటం గమనించదగ్గ అంశం.
ఇక బోయింగ్ డ్రీమ్‌లైనర్ భద్రతా లోపాలపై ఫిర్యాదు చేసిన ఇంజినీర్ జార్జి బార్నెట్ అనుమానాస్పద స్థితిలో నిరుడు మార్చిలో మరణించిన ఉదంతం కలవరపరుస్తుంది. ఆ సంస్థ క్వాలిటీ కంట్రోల్‌లో 32 ఏళ్లు పనిచేసిన బార్నెట్ రెండ్రోజులు విచారణకు హాజరై మూడో రోజు ఎందుకు తుపాకీతో కాల్చుకుంటాడన్నది ప్రశ్నార్థకమైంది.
టాటా ఎయిర్‌లైన్స్‌గా ఉన్న సంస్థను 1953లో నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జాతీయం చేసి, ఎయిరిండియాగా నామకరణం చేశారు. దేశీయ విమాన సర్వీసుల కోసం ఇండియన్ ఎయిర్‌లైన్స్ సంస్థ ఆవిర్భవించింది.
ఈ రెండూ పబ్లిక్ రంగ సంస్థలు కావటంతో పౌర విమానయాన రంగంలో అవి దిగ్గజ సంస్థలుగా వెలిగాయి. కానీ దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలై విమానయానంలో ప్రైవేటు సంస్థలు ప్రవేశించటం, తక్కువ ధరకే ప్రయాణికులను చేరవేసే సంప్రదాయాన్ని ప్రారంభించటంతో అంతక్రితమే నష్టాలతో ఉన్న ఆ సంస్థ మరింతగా కుంగిపోవటం మొదలైంది.
అసలు విమానయాన రంగంలో ప్రైవేటును అనుమతించినప్పుడే ఎయిరిండియా నిర్వహణను పూర్తిగా నిపుణులకు వదిలేయాల్సింది. కానీ పగ్గాలు ప్రభుత్వం దగ్గరే ఉండటం, దానికి లోబడి సంస్థ పనిచేయాల్సి రావటంతో ఎన్నో సమస్యలు చుట్టుముట్టాయి.



# మిడిల్ ఈస్ట్ మరో అగ్నిపర్వతం



ఇరాన్, ఇజ్రాయిల్ దేశాల మధ్య నెలకొన్న సుదీర్ఘ శత్రుత్వం తాజాగా మరోసారి మిడిల్ ఈస్ట్ భౌగోళిక, రాజకీయ సమీకరణాలను వణికించే స్థాయికి చేరింది. 2024 ఏప్రిల్‌లో ఇరాన్ తన భూభాగం నుండి నేరుగా ఇజ్రాయిల్‌పై భారీ డ్రోన్, క్షిపణి దాడులకు పాల్పడటం, అనంతరం ఇజ్రాయిల్ కౌంటర్‌స్ట్రైక్స్ చేయడం ద్వారా ఈ ఉద్రిక్తత క్షణాల్లోనే ప్రాదేశిక యుద్ధమవుతుందని ప్రపంచాన్ని కలవర పెట్టింది. ఇజ్రాయిల్‌కి చెందిన అత్యంత కీలకమైన రక్షణ సమాఖ్య అయిన మోసాద్ మాజీ అధికారి ఇలా అన్నారు: "ఇది మిడిల్ ఈస్ట్‌లో రెండో వరల్డ్ వార్‌కి సంకేతం కావొచ్చు. కానీ ఇప్పుడు జరిగేది బాంబులతో కాదు సంచలనాలతో, మిత్ర శత్రువుల మార్పులతో." ఈ సంఘటనకు తలదన్నేలా 2024 ఏప్రిల్ 13న ఇరాన్ దాదాపు 300కి పైగా డ్రోన్‌లు, క్రూజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులతో ఇజ్రాయిల్‌పై నేరుగా దాడికి దిగింది. ఇదే మొదటిసారి ఇరాన్ తాము అటాక్ చేస్తున్నట్లు ఓపెన్‌గా ప్రకటించి, తాము ప్రత్యక్ష యుద్ధంలో ఉన్నామంటూ ప్రపంచం ముందుకు వచ్చింది. ఇది అంతకుముందు ఏ దేశం చేసిన ధైర్యం కాదు. ఎందుకంటే ఇజ్రాయిల్ ఎప్పుడూ తన ప్రాధాన్యత ఉన్న లక్ష్యాలను విచక్షణ లేకుండా ధ్వంసం చేయడంలో పేరొందింది. అయితే ఈ దాడికి తలకాయగా నిలిచింది ఏప్రిల్ 1న ఇజ్రాయిల్ బెరుత్‌లోని ఇరాన్ దౌత్య కార్యాలయం (డిప్లొమాటిక్ మిషన్) పై జరిపిన గూఢచర్య దాడి. ఆ దాడిలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్‌స్‌కి చెందిన కీలక సైనికాధికారులు హతమయ్యారు. దానికే ప్రతీకారంగా ఈ పెద్ద ఎత్తున దాడిని ఇరాన్ ప్రారంభించింది. ఇజ్రాయిల్ దీనికి తక్షణమే సమాధానంగా ఎదురుదాడి చేసి, అంతరిక్షంలోనే వాటిలో 99% క్షిపణులను అడ్డుకోవడంలో విజయవంతమైంది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాల సహకారంతో ఇజ్రాయిల్ ఆ ఎదురు దాడిని మరింత దృఢతతో తిప్పికొట్టింది. ఇరాన్ దాడి తర్వాత మళ్లీ ఇజ్రాయిల్ మరోసారి ఇరాన్ లోపలున్న ఆయుధ ఉత్పత్తి కేంద్రాలపై పలు బాంబుల దాడులు నిర్వహించింది. ఇప్పుడు ప్రశ్న ఈ దాడులకు కారణాలు ఏమిటి? ఇది కేవలం ఒక దౌత్య సంస్థపై జరిపిన హత్యకు ప్రతీకారమేనా? లేక దీనికంటే లోతైన రాజకీయ, మతపరమైన అంశాలున్నాయా? ఇజ్రాయిల్‌ఇరాన్ ద్వంద్వం కొత్తది కాదు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం జరిగిన తర్వాత ఆ దేశం పూర్తి స్థాయిలో అమెరికాఇజ్రాయిల్ వ్యతిరేక శిబిరంలో చేరిపోయింది. షియా మతాధిపత్యాన్ని రక్షించడమే లక్ష్యంగా హిజ్బుల్లా, హమాస్ వంటి సంస్థలకు ఇరాన్ అందిస్తున్న మద్దతు ద్వారా ఈ పరిణామాలు మరింత వేగం పుంజుకున్నాయి. ఇరాన్ అణుశక్తిని అభివృద్ధి చేస్తూ, బాంబు తయారీ దశకు చేరుతున్నదన్న అనుమానాలు గత పదేళ్లుగా ప్రపంచాన్ని కలవర. పెడుతున్నాయి. ఇజ్రాయిల్‌కి ఇది గుండెల్లో రాయి. గతంలో కొన్ని సార్లు మోసాద్ గూఢచారులు ఇరాన్‌లోని అణు శాస్త్రవేత్తలను హత్య చేసిన దాఖలాలు ఉన్నాయి. ఇరాన్ తాము తక్కువ స్థాయిలో ఉన్నామని భావించడమే కాకుండా, తాము శక్తివంతంగా ఉన్నామన్న సందేశాన్ని ప్రపంచానికి ఇవ్వాలనుకుంది. అదే సమయంలో దేశంలో పెరుగుతున్న ప్రజాస్వామ్య వ్యతిరేకత, ఆర్థిక సంక్షోభం, యువతలో వ్యతిరేక భావాలను భద్రత దృష్టితో బయటకువచ్చిన ఆవేశాన్ని యుద్ధ సంచలనం ద్వారా మూలగానే పరిష్కరించాలన్న ఉద్దేశమూ ఉంది. ఇరాన్ దాడిపై అమెరికా స్పందన అనేక ఆశ్చర్యాలను కలిగించింది. అధ్యక్షుడు జో బైడెన్ స్పష్టం చేశారు "ఇజ్రాయిల్‌పై దాడిని మేము ఖండిస్తున్నాం. కానీ ఇది యుద్ధానికి దారి తీసేలా కాకుండా నియంత్రణ అవసరం." అంటే అమెరికా తన సంప్రదాయ మిత్రుడికి మద్దతిస్తూనే, ప్రాదేశిక యుద్ధాన్ని నివారించాలన్న నిబద్ధతను ప్రదర్శించింది. అదే సమయంలో యుఎన్ భద్రతామండలి అత్యవసర సమావేశం నిర్వహించి, ఇరాన్ దాడిని ఖండిస్తూ తీర్మానం చేసింది. భారతదేశం సహా ప్రపంచ దేశాలన్నీ ఈ ఘటనపై చింతన వ్యక్తం చేశాయి. చైనా, రష్యా తదితరులు మౌనంగా స్పందించగా, అరబ్ దేశాలు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఈ దాడులపై ఆందోళన వ్యక్తం చేసి మళ్లీ చర్చల ద్వారా పరిష్కారం కోరాయి. ఈ ఘటన ఫలితాలు కొన్ని కీలక ప్రాతినిధ్యాలు సూచిస్తున్నాయి. మొదటిగా, ఈ దాడులు మిడిల్ ఈస్ట్‌లో స్తబ్ధంగా ఉన్న శక్తుల పోరాటానికి మళ్లీ నిప్పంటించాయి. రెండవది, ఇజ్రాయిల్‌కి నేరుగా దాడికి దిగడం ద్వారా ఇరాన్ తన భయపడే మనస్తత్వాన్ని పక్కనపెట్టి కొత్త దారిలో అడుగుపెట్టింది. మూడవది, ఈ దాడుల వల్ల ఖతార్, లెబనాన్, సిరియా, ఇరాక్ వంటి దేశాల్లో సున్నీషియా ఘర్షణలు మళ్లీ భయంకరంగా మారే అవకాశముంది. అంతేకాదు, గాజా యుద్ధం ఇప్పటికీ కొనసాగుతుండగా, ఇరాన్‌ఇజ్రాయిల్ మధ్య నేరుగా ఘర్షణ జరగడం ఫలితంగా పశ్చిమ ఆసియా లో మానవీయ సంక్షోభం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఆయిల్ ధరలు పెరగడం, షిప్పింగ్ మార్గాల్లో అంతరాయాలు రావడం వంటి ప్రపంచ ఆర్థిక ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇది కేవలం రెండు దేశాల మధ్య మిలిటరీ కాంక్షల పోరాటం కాదు. ఇది మతం, రాజకీయ స్వాధీనం, భద్రతా ఆందోళన, ప్రపంచ శక్తుల ప్రయోజనాల మిశ్రమ సమీకరణ. ఈ మినీ యుద్ధం ఇక మౌలికంగా మార్చుకునే ప్రమాదమున్నది. చరిత్ర గమనాన్ని చూసినట్లయితే, 2006 హిజ్బుల్లాఇజ్రాయిల్ యుద్ధం, 2019 సౌదీ అరాంకోపై డ్రోన్ దాడి, 2021 గాజా సంక్షోభం వంటి ఉదాహరణలు మిడిల్ ఈస్ట్‌లో ఎప్పుడెప్పుడు మంటలు చెలరేగే అవకాశం ఉందని స్పష్టం చేస్తాయి. ఈ నేపథ్యంలో, శాంతి కోరిక కేవలం మాటలకే పరిమితమై పోకుండా, ప్రాతినిధ్య సమూహాల నడుమ చర్చల వేదికలు ఏర్పాటు చేయాలి. ఇజ్రాయిల్‌కు భద్రతా హామీ, ఇరాన్‌కు అణు అభివృద్ధిపై పారదర్శకత ఈ రెండు అంశాలు ఒకే సమయంలో సాధ్యమవ్వాలి. లేకపోతే మిడిల్ ఈస్ట్‌లోని అగ్ని పర్వతం మళ్లీ బద్దలయ్యే ప్రమాదం తప్పదు.

సోమవారం-23- జూన్ 2025

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## మున్నూరు కాపు సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ హైకమాండ్‌కు విజ్ఞప్తి

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణలోని అతిపెద్ద సామాజిక వర్గాల్లో ఒకటైన మున్నూరు కాపు వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఈ వర్గానికి చెందిన ఏకైక శాసనసభ్యుడు ఆదిభట్ల శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ, మున్నూరు కాపుల సంఘ ప్రతినిధులు ఈ రోజు గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు వినతి పత్రం సమర్పించారు.
ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా మున్నూరు కాపు ప్రధాన కార్యదర్శి పొంచెట్టి శంకర్, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు కూరగాయల కొమురయ్య, మార్కెట్ కమిటీ అధ్యక్షులు కచ్చకాయల ఎల్లయ్య, చేలుకల తిరుపతి, పట్టణ అధ్యక్షులు ఇప్ప పూల అజయ్, పట్టణ ప్రధాన కార్యదర్శి బొందిల మహేష్, కచ్చకాయల బాలరాజు, బోయినపల్లి మండల ప్రధాన కార్యదర్శి అమిరిశెట్టి భూమిరెడ్డి, సహకార సంఘం డైరెక్టర్లు తోటరాజు, సాయిని అంజయ్య, మాజీ సర్పంచ్ సోయినేని కరుణాకర్, బొప్ప బిక్షపతి, రుద్రంగి మండల అధ్యక్షులు తుమ్ జలపతి, ఎర్రం గంగ నరసయ్య, పొంచెట్టి సురేష్, పోశెట్టి మధు, పొంచెట్టి సాయి, పొంచెట్టి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.వర్గానికి న్యాయం జరిగేలా కాంగ్రెస్ హైకమాండ్ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



## మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యం





◆ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమైనదని ఖమ్మం టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అవగాహన కార్యక్రమాల నిర్వహణలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని రేవతి సెంటర్ చెందిన యువత కు అవగాహన కార్యక్రమం స్థానిక కవిత డిగ్రీ కాలేజ్ లో ఆదివారం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ సరదా కోసం మొదలైన అలవాటు.. మత్తులోకి నెడుతోందని, గతంలో సిగరెట్, మద్యంతో సరిపెట్టుకునే యువత.. ఇప్పుడు నిషా కోసం గంజాయి, మాదకద్రవ్యాల బారినపడి మత్తుకు బానిసలవుతున్నారని అన్నారు. సమాజంలోని మాదకద్రవ్యాల ముప్పును అంతం చేసే లక్ష్యంతో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఇప్పటికే పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన కోసం నషాముక్త్ భారత్ అభియాన్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. మాదక ద్రవ్యాలకు ప్రభావితమైన వారిని ఆ మహమ్మారి వ్యసనాల నుండి బయట పడేసేందుకు డి ఎడిక్షన్ కేంద్రాలు కూడా నిర్వహించబడుతున్నాయన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు నేటి యువత బానిసలై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉండేలా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మాదక ద్రవ్యాల వినియోగం కారణంగా కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల బానిసలై విముక్తిపొందిన వారితో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను గురించి తెలియజేసినట్లైతే , యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా రక్షించవచ్చన్నారు.

## మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో యువత భాగస్వామ్యం కావాలి

◆ కారేపల్లి ఎస్సై

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో యువత భాగస్వామ్యం కావాలని కారేపల్లి ఎస్సై గోపి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని కారేపల్లి పోలీసుల ఆధ్వర్యంలో కారేపల్లి సెంటర్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ సమగ్ర అవగాహన అవసరమని అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం అనేది వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబం, సమాజం మరియు దేశం పైన కూడా ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుందని అన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా నైతిక విలువలు అలవర్చుకొని ఉజ్వలభవిష్యత్తుకు పునాది వేయాలని అన్నారు.



## ఎర్రుపాలెం మండలం భీమవరంలో ఘనంగా ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ





ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం రాయన్న పేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు అన్న నందమూరి తారాక రామారావు విగ్రహ ఆవిష్కరణ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఎర్రుపాలెం మండల మాజీ అధ్యక్షులు దోమందుల సామేల్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు, టిటిడి కమిటి మెంబర్ నన్నూరి నర్సిరెడ్డి హాజరయ్యారు, వీరి చేతుల మీదుగా పార్టీ జెండా ఆవిష్కరణ మరియు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ వేలాదిగా తరలివచ్చిన నాయకులు అభిమానులు కార్యకర్తల మధ్య ఘనంగా జరిగింది, అనంతరం బక్కని నరసింహులు మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ ద్వారా తెలుగు ప్రజలకు పరిచయమై మహానటుగా అందరి మన్ననలు పొంది బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం పార్టీని స్థాపించి అనతి కాలంలోనే అధికారం చేపట్టి పటేల్ పట్వారి వ్యవస్థను రద్దుచేసి సామాన్యుడికి సైతం రాజకీయం నేర్పిన గురువుగా ప్రజల గుండెల్లో నిండిపోయాడు మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించటమే కాక చిట్టసభల్లో స్థానం కల్పించి మహిళలకు పెద్దపీట వేశారని ఆ రోజుల్లో కిలో 2 రూపాయలు బియ్యం పథకం పెట్టి పేదవాడికి అన్నం పెట్టిన మహానుభావుడు అని అన్నారు. అనంతరం ఇతర నాయకులు ఎన్టీఆర్ చేసిన సేవలు సంక్షేమ పథకాలు విజయాలు గుర్తు చేసుకుంటూ కొనియాడారు.
వీరి వెంట, ఖమ్మం పార్లమెంట్ నాయకులు వాసిరెడ్డి రామనాథం, కూరపాటి వెంకటేశ్వర్లు, కనగాల సాంబశివరావు, కాపా క్రిష్ణ మోహన్, చెరుకూరు చలపతిరావు, కిలారు సురేందర్, కొండబాల కర్ణాకర్, కేతినేని హరీష్, గుత్తా సీతయ్య, కత్రం స్వామి,చేకూరి శేఖర్ బాబు, మల్లాది హనుమంతరావు, మండేపూడి శ్రీనివాస్, ఆర్‌ఎం వరలక్ష్మి, రామయ్య, మహబూబాబాద్ ప్రెసిడెంట్ రామచంద్ర రావు, పోలంపల్లి అశోక్ ముందడపు సుధాకర్, పోటు సరస్వతి, మల్లెంపాటి అప్పారావు, రాజరాజేశ్వరి పాలడుగు కృష్ణ ప్రసాద్, మందపల్లి రజిని, మేడిపల్లి రాణి , చలసాని ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు

## పి వై ఎల్ ఖమ్మం జిల్లా జనరల్ కౌన్సిల్ ను జయప్రదం చేయండి


◆ పి వై ఎల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాటోత్ ప్రేమ్ సింగ్,ఎన్ వి రాకేష్..

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:




యువత ఎదుర్కొంటున్న సమస్య ప్రధానంగా నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం నిరుద్యోగుల జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్ గంజాయి బెట్టింగ్ వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్నది ప్రగతిశీల యువజన సంఘం పి వై ఎల్ అని, తన జిల్లా స్థాయి జనరల్ కౌన్సిల్ లను జూన్ 28న ఖమ్మం నగరంలోని రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్నాయని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాటోత్ ప్రేమ్ సింగ్ ఎన్ వి రాకేష్‌లు తెలిపారు.
ఆదివారం స్థానిక రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగిస్తూ పదేళ్ల పాటు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన కెసిఆర్ తెలంగాణ ప్రజలకు యువకులకు విద్యార్థులకు మౌలిక సమస్యలు పరిష్కారం చూపడంలో విఫలం చెందిందని అందువలనే గడిచిన ఎన్నికలలో కెసిఆర్ కు తెలంగాణ ప్రజల యువకులు బుద్ధి చెప్పారని వారు అన్నారు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలతో కాలం గడపకుండా ఇచ్చిన హామీలను అమలకు పూనుకోవాలని అన్నారు గత పది సంవత్సరాల నుండి నిరుద్యోగులు ఉద్యోగాలు రాక నిరుద్యోగ భృతి లేక దిక్కుతోచని పరిస్థితిలలో కాయకష్టం చేస్తూ జీవిస్తున్నారని,పని చేద్దామన్న పని దొరకక నానా అవస్థలు పడుతున్నారని, ఎంతోమంది యువతి యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా పెరిగిపోయి యువత బతకలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు యువత ఉద్యోగ ఉపాధి లేక ఈజీ మనీకీ అలవాటు పడి బెట్టింగ్ యాప్స్ కు బానిసవుతున్నారని బెట్టింగ్ల డ్రగ్స్ గంజాయి వల్ల యువత జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు
రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి, నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరుద్యోగ భృతి 6000 ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు ఈ నేపథ్యంలో యువకులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైనా నిరుద్యోగం మరియు యువతను పక్కదారు పట్టిస్తున్న బెట్టింగ్ డ్రగ్స్ గంజాయి సమస్యపై పోరాడుతున్న ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ ఖమ్మం జిల్లా జనరల్ కౌన్సిల్ ను జూన్ 28న రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రం ఖమ్మంలో జరుగుతున్నాయని ఈ జనరల్ కౌన్సిలర్ కు యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి వై ఎల్ రాష్ట్ర నాయకులు జె.భరత్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఇస్లావత్ రమేష్ సిహెచ్ ధరణి నగర అధ్యక్ష కార్యదర్శులు అశోక్ మక్కా రవీందర్ నాయకులు డి చందు శివలాల్ రవి తదితరులు పాల్గొన్నారు.

## సృష్టి.. దృష్టి...



ఓ మనిషీ...
నీ దృష్టిలో...
ఈ సృష్టిలో...
నీ జీవితంలో...
కొందరు వరాల వర్షం...
కొందరు శాపాల శల్యాలు..!

కొందరు పూల మేడలు.
కొందరు ముళ్ళ జాడలు...
కొందరు జీవిత పాఠాలు చెప్పే
గుణపాఠాలు నేర్పే గురువులు..!

కొందరు కలలతో
నీ ఆశల్ని అందంగా
అలంకరించే కల్పతరువులు..!

కొందరు నడివీధిలో
నీ పరువును నిలువునా
దహించివేసే నిప్పు కణికలు..!

కొందరు నీవు మోయలేని
భారమైన బరువులు...
కొందరు...ఆపదలో ఉన్న
నిన్ను ఆప్యాయంగా
ఆదుకునే ఆపద్బాంధవులు..!

కొందరు
కడుపులో
కత్తులుంచుకొని
కౌగలించుకొనే బద్ధ శత్రువులు...
కానీ వీరంతా భగవంతుని సృష్టి కాదు..!

అందుకే
ఓ మనిషీ...
గుర్తుంచుకో..!
నీ జన్మ దైవసృష్టి...
నీ అమ్మ నాన్నల ఆశీర్వాదం...
నీ స్నేహం నీ స్వభావ సృష్టి...
నీ శత్రుత్వం నీ కోపతాపాల దాహం..!

పగ ప్రతీకారాలు...
అసూయా ద్వేషాలు...
ఖచ్చితంగా నీ మనసును
కాల్చి వేయవచ్చు కానీ
నీ కలల ప్రపంచాన్ని కాదు..!

నిజానికి నీలో పొంగి పొర్లే ఆ ప్రేమ
ఆ కరుణ ఆ జాలిదయ సద్గుణాలతో
నీవు ఈ ప్రపంచాన్నే జయించవచ్చు...!



రచన:
కవిరత్న
సాహిత్యధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి,
అత్తాపూర్, హైదరాబాద్
చరవాణి...9110784502

## మతంతో పనిలేదు!

ఆమతం ఈమతంకాదు
ఏమతమైనాఏంచేసాయి
దేవుడుపరిష్కారమన్నాయి
గుళ్ళుచర్చిమసీదుల్లుకట్టాయి!

వేదం బైబిల్ ఖురాన్ లు
వేలకొద్దీ పేజీలు నింపి
శ్లోకాలుకాండలుసురాలు
బోధించి ఏమిఫలము?

ఇప్పటికీ జనానికి
తిండీ గుడ్డ నీడాలేదు!
అక్షరాస్యత లేదు
ఎందుకు ఆగ్రంథాలు?

వాటినిండా మానవ బంధాలు
ఎంత జుగుప్సాకరం?
అంతా అశ్లీలం, బూతు?
కాస్త కళ్ళు తెరవండి!

మన ఓటుతో గెలిచినోళ్లు
ఏం చేస్తున్నారో.. రండి
పార్లమెంటు అసెంబ్లీలు
అక్కడ నోరు విప్పండి!

మతాలకు కాలంచెల్లెను
అసమానతలు పోతే
నైతికత అదే పెరుగును
మతతో నేడు పనిలేదు!

నేడు చట్టసభలే
ఆధునిక దేవాలయాలు!
ఈ మహానాయకులే
ఆధునిక దేవుళ్ళు!

వాళ్ళను నిలదీద్దాం!
సమానత్వం కోసం
కలిసిపోరాడదాం!
మతమేల తమ్ముళ్లు?



-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
సోమవారం-23- జూన్ 2025


# ఆడవాళ్లు కాళ్లకు మెట్టెలు ఎందుకు ధరిస్తారు..?

మన పూర్వీకులు చెప్పిన మాటలు ఊరికే చెప్పినవి కావని.. వాటి వెనుక పెద్ద శాస్త్రీయ కారణాలు ఉన్నాయని ఆయుర్వేద పరిశోధనలు నిరూపిస్తున్నాయి. వీటిలో ముఖ్యమైంది ఆడవాళ్లు కాళ్లకు పెట్టుకునే వెండి మెట్టెల రహస్యం. భారతీయ సంస్కృతిలో ఆడవాళ్లు తమ కాళ్లకు వెండితో చేసిన మెట్టెలు పెట్టుకునే ఆచారం ఉంటుంది. ఇది కేవలం అందం కోసమే కాదు.. ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవి. గర్భాశయం, పాదాల్లోని నరాల మధ్య ఉన్న సహజ సంబంధాన్ని బట్టి.. కాళ్లకు పెట్టుకునే మెట్టెలు కొన్ని ఆరోగ్య సమస్యలను రాకుండా చేస్తాయని నమ్మకం. ముఖ్యంగా గర్భం దాల్చిన సమయంలో వచ్చే తలనొప్పులు, వాంతులు, అలసట, ఆకలి లేకపోవడం వంటి సమస్యలను తగ్గించడానికి ఇది సహాయపడుతుందట. వెండిలో ఉండే సహజమైన మాగ్నెటిక్ శక్తి, శరీరంలోని ముఖ్యమైన నరాలపై ప్రభావం చూపి శక్తిని సమతుల్యంగా పంచుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. వెండిని తాకినప్పుడు మన శరీరంలోని వేడి తగ్గిపోతుంది. రక్తప్రసరణ కూడా మెరుగుపడుతుంది. ఇది నరాల పనితీరును సమతుల్యం చేస్తుంది. గర్భిణీ స్త్రీలు రోజూ సరైన సమయంలో ఆ నరాలను చేత్తో నొక్కడం సాధ్యం కాదు. అలాంటి సమయంలో కాళ్లకు ధరించే వెండి మెట్టెల వల్ల కలిగే తక్కువ ఒత్తిడి తరచూ తగిలే స్వభావం ద్వారా.. సహజంగా రిఫ్లెక్స్ మసాజ్ లాగా పని చేస్తుంది. దీని వల్ల శరీరంలోని నాడీమండలం ఉత్సాహంగా మారి ఆరోగ్యం బాగుపడుతుంది. నడవడం లాంటి రోజువారీ పనుల్లో ఈ మెట్టెలు పాదంలోని కొన్ని ముఖ్యమైన పాయింట్లను తాకి అక్కడ కొద్దిగా ఒత్తిడిని కలిగిస్తాయి. దీని వల్ల నాడీ వ్యవస్థ చురుకుగా మారి హార్మోన్ల సమతుల్యతతో పాటు శరీరంలోని చాలా అవయవాలకు శక్తి అందుతుంది. ఇది గర్భాశయం ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుంది. కాళ్లకు పెట్టుకునే వెండి మెట్టెలలో దాగి ఉన్న రహస్యాలు.. శాస్త్రీయంగా చూసినప్పుడు ఆశ్చర్యంగా అనిపిస్తాయి. ఇది కేవలం ఒక ఆచారమే కాదు.. ఆరోగ్యాన్ని కాపాడే తెలివికి, తరతరాల సంప్రదాయానికి నిదర్శనం.



## సడెన్‌గా మందులు మానేస్తున్నారా..?


మారుతున్న జీవనశైలి కారణంగా, అధిక రక్తపోటు గురించి ఫిర్యాదులు ప్రజలలో సర్వసాధారణంగా మారుతున్నాయి. అటువంటి పరిస్థితిలో, వైద్యులు నిరంతరం మందులు తీసుకోవాలని సిఫార్సు చేస్తారు. కానీ చాలా సార్లు ప్రజలు వైద్యుడిని సంప్రదించకుండా మందులు తీసుకోవడం మానేస్తారు.. ఇది చాలా ప్రమాదకరమంటున్నారు వైద్యనిపుణులు. ఒకప్పుడు వృద్ధాప్యంలో వచ్చే అధిక రక్తపోటు సమస్య ఇప్పుడు యువకులు, మధ్య వయస్కులలో కూడా కనిపిస్తోంది. అటువంటి పరిస్థితిలో, బిపిని నియంత్రణలో ఉంచడానికి వైద్యులు నిరంతరం మందులు తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. ఈ మందులను నిరంతరం తీసుకోవడం చాలా ముఖ్యం. కానీ చాలా సార్లు రోగులు వైద్యుడిని సంప్రదించకుండా మందులు తీసుకోవడం మానేస్తారు.. ఇది అనేక సమస్యలకు దారితీస్తుంది. అటువంటి పరిస్థితిలో, గుండె, మెదడు, మూత్రపిండాలు, కళ్ళు తీవ్రంగా ప్రభావితమవుతాయి. దీని వల్ల ఎలాంటి నష్టం జరుగుతుంది.. వైద్య నిపుణులు ఏం చెబుతున్నారు..? అధిక రక్తపోటు కారణంగా, రక్త నాళాలలో ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల, మీరు అధిక రక్తపోటుకు మందు తీసుకోవడం ఆపివేస్తే, అది గుండె, మెదడు, మూత్రపిండాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది.. నిరంతర అధిక రక్తపోటు కారణంగా అవి దెబ్బతింటాయి. ఇది జీవితాంతం సమస్యలకు కారణం కావచ్చు. అకస్మాత్తుగా మందులు ఆపివేసిన తర్వాత, రోగికి తలనొప్పి, తలతిరగడం, భయము, ఛాతీ నొప్పి, వేగవంతమైన హృదయ స్పందన, కాళ్ళలో వాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉండవచ్చు.. ఇలాంటి పరిస్థితుల్లో పరిస్థితి మరింత దిగజారిపోయే అవకాశం ఉంది. రోగిని వెంటనే ఆసుపత్రిలో చేర్చాల్సి రావచ్చు. ఢిల్లీలోని ఆర్‌ఎంఎల్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి మాట్లాడుతూ.. అధిక రక్తపోటు మందులను ఆపడం ద్వారా మెదడు రక్తస్రావం లేదా పక్షవాతం వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. కొన్నిసార్లు రోగి అకస్మాత్తుగా మూర్ఛపోవడం, శరీరంలోని ఏదో ఒక భాగంలో బలహీనత లేదా మాట్లాడటంలో ఇబ్బంది గురించి ఫిర్యాదు చేయడం ప్రారంభిస్తాడు. అధిక రక్తపోటు మందులను అకస్మాత్తుగా ఆపడం వల్ల గుండెపై ఒత్తిడి పెరుగుతుంది.. ఇది గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. కిడ్నీ వైఫల్యం కూడా సంభవించవచ్చు. అకస్మాత్తుగా మందులను ఆపడం వల్ల రక్తపోటును నియంత్రించడం కష్టమవుతుంది.. మందుల ప్రభావం కూడా తగ్గుతుంది. చాలా సార్లు రోగులు తమ రక్తపోటు ఇప్పుడు సాధారణమైందని భావిస్తారని, కాబట్టి వారికి మందులు అవసరం లేదని సొంతంగా నిర్ణయం తీసుకుంటారని డాక్టర్ సుభాష్ వివరించారు. కొంతమంది మందుల దుష్ప్రభావాలకు భయపడి మందులు తీసుకోవడం మానేస్తారు. కొంతమంది మతిమరుపు లేదా నిర్లక్ష్యం కారణంగా అధిక బిపి మందులు తీసుకోవడం మానేస్తారు. కొన్ని సందర్భాల్లో, ప్రజలు ఇంటి లేదా ఇతర పద్ధతులపై ఆధారపడటం ద్వారా మందులు తీసుకోవడం మానేస్తారు.





# తిన్న వెంటనే కూర్చుంటున్నారా..?

మనలో చాలా మంది భోజనం తర్వాత పది నిమిషాలు కూర్చోవాలని అనుకుంటాం. కొందరు వెంటనే పడుకోవడానికి ప్రయత్నిస్తారు. కానీ ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. అలసట తగ్గుతుంది అనుకున్నా.. దీని వల్ల శరీరానికి చాలా నష్టాలు జరుగుతాయి. ముఖ్యంగా రక్తంలో చక్కెర స్థాయిపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. ఎక్కువగా కార్బోహైడ్రేట్లు ఉన్న అన్నం లేక పిండి పదార్థాలు తిన్న తర్వాత కదలకుండా కూర్చుంటే.. రక్తంలో గ్లూకోజ్ స్థాయి చాలా పెరుగుతుంది. ఇది అలాగే ఉంటే టైప్ 2 షుగర్ డిసీజ్ రావడమే కాకుండా.. పొట్ట చుట్టూ కొవ్వు పేరుకునే ప్రమాదం ఉంది. దీన్ని ఆపడానికి ఒక చిన్న మార్గం ఉంది. భోజనం చేసిన తర్వాత కేవలం రెండు నిమిషాలు నడవడం. నడక శరీరంలోని ముఖ్యమైన కండరాలను పనిచేయిస్తుంది. భోజనం తర్వాత నడిస్తే ఆహారం ద్వారా వచ్చిన గ్లూకోజ్ శరీరంలో వేగంగా ఖర్చవుతుంది. దీని వల్ల బ్లడ్ షుగర్ స్థాయి అదుపులో ఉంటుంది. అంతే కాదు మనం తీసుకునే ఎక్కువ క్యాలరీలు కూడా



శరీరంలో తక్కువగా నిల్వ అవుతాయి. ఇది పొట్ట చుట్టూ పేరుకునే కొవ్వును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. ఒక ప్రసిద్ధ స్పోర్ట్స్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనాల ప్రకారం, భోజనం చేసిన వెంటనే 2 నుంచి 5 నిమిషాలు నడిచేవారిలో, కూర్చునే వారితో పోలిస్తే బ్లడ్ గ్లూకోజ్ స్థాయి తక్కువగా ఉంది. ఈ చిన్న నడక గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలోనూ, అధిక రక్తపోటును నియంత్రించడంలోనూ సహాయపడుతుంది. అధ్యయనాల ప్రకారం.. భోజనం చేసిన వెంటనే 2 నుంచి 5 నిమిషాలు నడిచే వారిలో, కూర్చునే వారితో పోలిస్తే రక్తంలో చక్కెర స్థాయి తక్కువగా ఉంది. ఈ చిన్న నడక గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలోనూ.. అధిక రక్తపోటును నియంత్రించడంలోనూ సహాయపడుతుంది. భోజనం తర్వాత నడక వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. రక్తంలో చక్కెర స్థాయి తక్కువగా ఉంటుంది.గ్లూకోజ్ శరీరంలో త్వరగా ఖర్చవుతుంది.ఎక్కువ క్యాలరీల నిల్వ తగ్గుతుంది.జీర్ణక్రియకు సహాయపడుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది.గుండె ఆరోగ్యంపై మంచి ప్రభావం ఉంటుంది.నిద్రలేమి సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. దీనికి పెద్దగా వ్యాయామం చేయాల్సిన అవసరం లేదు.

## అరటి ఆకుల్లోనే భోజనం చేయండి..

అరటి ఆకులో భోజనం అనేది కేవలం సంప్రదాయమే కాదు.. శాస్త్రీయ కారణాల నుంచి జెనెటిక్ ప్రయోజనాలు కూడా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అరటి ఆకులో భోజనం చేయడం వల్ల కఫవాతాలు తగ్గిపోతాయి. శరీరానికి బలం చేకూరుతుంది. బాగా ఆకలివేస్తుంది. ఆరోగ్యం చక్కబడి శరీరానికి మంచి కాంతి వస్తుంది. అరటి ఆకులో తినడం వల్ల ఆహారం రుచి పెరుగుతుంది. ఆకులు భోజనం, మంచి రుచిని అందిస్తాయి. అరటి ఆకులలో పాలీఫెనాల్స్, విటమిన్ ఎ, విటమిన్ సి వంటి అనేక ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. అరటి ఆకుపై ఆహారాన్ని ఉంచినప్పుడు, ఈ పోషకాలలో కొన్ని ఆహారానికి బదిలీ అవుతాయి. అలా మీరు తినే ఆహారం పోషక విలువను పెంచుతుంది. అరటి ఆకులో ఆహారం తీసుకుంటే ఆహారం రుచి పెరుగుతుంది. ఆకులు ఆహారానికి తేలికపాటి, మట్టి రుచిని అందిస్తాయి. ఇది ఆహారం రుచిని పెంచుతుంది. అరటి ఆకులపై ఆహారం తీసుకోవడం వల్ల ఆహారానికి సంప్రదాయ ఆకర్షణ లభిస్తుంది. మీరు మంచి హృదయంతో ఆహారం తీసుకుంటే, అది మీ ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలను ఇస్తుంది. అరటి ఆకులు ప్లాస్టిక్ లేదా థర్మాకోల్ ప్లేట్‌లతో పోలిస్తే విషపూరితం కాదు, కాబట్టి హానికరమైన రసాయనాలు ఆహారంలో చేరవు. ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అరటి ఆకులపై ఆహారం తీసుకోవడం వల్ల జీర్ణక్రియపై సానుకూల ప్రభావం ఉంటుంది. అరటి ఆకులలో ఉండే పాలీఫెనాల్స్ జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచుతాయి. ఇవి మంచి జీర్ణక్రియ, పోషకాలను గ్రహించడంలో సహాయపడతాయి. అరటి ఆకులలో సహజ యాంటీమైక్రోబయల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి ఆహారంలోని హానికరమైన బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. అందువల్ల, అరటి ఆకులపై ఆహారం తీసుకోవడం వల్ల ఆహారం ద్వారా సంక్రమించే వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పచ్చగా ఉండే అరటి ఆకులో ఆహారం పెట్టుకుని తినడం వల్ల త్వరగా జీర్ణమవుతుంది. అరటి ఆకులను ఉపయోగించడం పర్యావరణ అనుకూల ఎంపిక. ఇది ప్లాస్టిక్ లేదా ఫోమ్ ప్లేట్ల అవసరాన్ని తగ్గిస్తుంది. ఇది భూమి కాలుష్యాన్ని తగ్గిస్తుంది.


## ఈజీగా దొరుకుతుందని ఫుల్లుగా తింటున్నారా..?

బ్రెడ్ అనేది పెద్ద నగరాలతో పాటు గ్రామాలు, పట్టణాలలో కూడా లభించే సులభమైన అల్పాహారం. కానీ ఇది శారీరక, మానసిక అనారోగ్యాలకు కూడా కారణం కావచ్చు. రోజూ బ్రెడ్ తినడం వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తుతాయి. నేటి బిజీ జీవితంలో.. బ్రెడ్ అనేది అత్యంత సులభమైన అల్పాహారం.. ఎక్కడైన ఈజీగా దొరుకుతుంది.. వాస్తవానికి ఈ బ్రెడ్ త్వరగా తయారవుతుంది.. అనేక రుచులతో లభిస్తుంది.. అందుకే.. బ్రెడ్ పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ ఇష్టమైనదిగా మారింది. నేడు చాలా మంది తమ ఉదయం బ్రెడ్-జామ్ లేదా బ్రెడ్-బటర్ వంటి అల్పాహారంతో ప్రారంభిస్తారు. కానీ సులభంగా లభించడంతోపాటు.. ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే ఈ బ్రెడ్ కూడా అనేక సమస్యలకు కారణం అవుతోందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. రోజూ బ్రెడ్ తినే వ్యక్తులు శారీరకంగానే కాకుండా మానసిక వ్యాధుల బారిన పడతారని నిపుణులు చెబుతున్నారు. బ్రెడ్‌లో ఉండే అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ రక్తంలో చక్కెరను వేగంగా పెంచుతుంది.. ఇది డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతుంది. బ్రెడ్‌లో ఫైబర్ - విటమిన్ జు లేకపోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుంది.. అంతేకాకుండా గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. బ్రెడ్‌లో ఉండే గ్లూటెన్, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు మలబద్ధకం, కడుపు నొప్పి, విరేచనాలు వంటి సమస్యలను కలిగిస్తాయి. అధిక మొత్తంలో కేలరీలు, కార్బోహైడ్రేట్ల కారణంగా, ఎక్కువ బ్రెడ్ తినడం వల్ల బరువు వేగంగా పెరుగుతుంది. ఇది కాకుండా, రోజూ బ్రెడ్ తినడం వల్ల కాలేయం, మూత్రపిండాలపై చెడు ప్రభావం చూపుతుంది. బ్రెడ్‌లో అనేక రకాల ప్రిజర్వేటివ్‌లు, రసాయనాలు కలుపుతారు. ఇది శరీర జీర్ణవ్యవస్థను ప్రభావితం చేస్తుంది. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ పరిశోధన ప్రకారం.. ప్రతిరోజూ బ్రెడ్ తినడం వల్ల శారీరకంగానే కాకుండా మానసిక ఆరోగ్యం కూడా ప్రభావితమవుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, బ్రెడ్‌లో ఉండే శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, గ్లూటెన్ నిరాశ, ఒత్తిడి, ఏకాగ్రత లేకపోవడం వంటి మానసిక సమస్యలను కలిగిస్తాయి. బ్రెడ్‌ను నిరంతరం తినడం వల్ల శరీరంలో మంట కూడా వస్తుంది. ఇది మెదడు పనితీరు సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. రోజూ బ్రెడ్ తినడం వల్ల ఆటో-బ్రూవరీ సిండ్రోమ్ వచ్చే ప్రమాదం ఉంది. నిజానికి, ఈస్ట్‌ను బ్రెడ్ తయారు చేయడానికి ఉపయోగిస్తారు. రోజూ బ్రెడ్ తినడం వల్ల కడుపులో ఈస్ట్ పరిమాణం పెరుగుతుంది. అటువంటి పరిస్థితిలో, కడుపులో ఉండే బ్యాక్టీరియా బ్రెడ్‌లో ఉండే కార్బోహైడ్రేట్‌లను జీర్ణం చేసినప్పుడు, కిణ్వ ప్రక్రియ జరుగుతుంది. దీని కారణంగా ఆల్కహాల్ అంటే ఇథనాల్ కడుపులో ఏర్పడుతుంది. దీని కారణంగా రోగి మద్యం తాగకుండానే మత్తు వంటి లక్షణాలను అనుభవిస్తాడు. ఇది ఒక రకమైన మానసిక వ్యాధి.. ఇది ఎక్కువగా బ్రెడ్ తినే వారికి సంభవించవచ్చు.



## ఏదైనా ఆలోచిస్తున్నప్పుడు గుండె చప్పుడు ఎందుకు పెరుగుతుంది..?

చాలా మందికి ఏదైనా విషయం గురించి ఆలోచించినప్పుడు వారి గుండె వేగంగా కొట్టుకుంటుందని అనిపిస్తుంది.. అది పాత జ్ఞాపకం అయినా, భయం అయినా లేదా భవిష్యత్తు గురించి ఆందోళన అయినా.. అటువంటి పరిస్థితిలో హృదయ స్పందన అకస్మాత్తుగా వేగంగా అనిపిస్తుంది. కొన్నిసార్లు మనం లోతైన ఆలోచనల్లో మునిగిపోయినప్పుడు లేదా కొంత ఆందోళన లేదా భయంతో ఉన్నప్పుడు.. మన హృదయ స్పందన అకస్మాత్తుగా పెరుగుతుంది. ఈ పరిస్థితి చాలా మందికి సంభవిస్తుంది.. ఇలాంటి పరిస్థితుల్లో తరచుగా ప్రజలు గుండె సమస్య కాకపోయినా భయపడతారు. సాధారణ పరిస్థితులలో, ఒక వయోజన వ్యక్తి హృదయ స్పందన నిమిషానికి 60 నుంచి 100 బీట్స్ (దీూవీ).. కానీ హృదయ స్పందన రేటు 100 దీూవీ కంటే ఎక్కువగా ఉన్నప్పుడు.. శారీరక శ్రమ లేనప్పుడు, దానిని 'టాచీకార్డియా' అంటారు. ఆలోచిస్తున్నప్పుడు హృదయ స్పందన పెరగడం మానసిక, శారీరక ప్రతిచర్య కావచ్చు. మనం ఏదైనా ఆందోళన, భయం, ఉద్రిక్తత లేదా గందరగోళ ఆలోచనలలో మునిగిపోయినప్పుడు, ఈ పరిస్థితిలో శరీరంలో ఒత్తిడి హార్మోన్ల స్థాయి అంటే కార్టిసాల్, అడ్రినలిన్ పెరగడం ప్రారంభమవుతుంది.. దీని కారణంగా హృదయ స్పందన పెరుగుతుంది. ఇది శరీరం సహజ ప్రక్రియ.. ఇది ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి మిమ్మల్ని సిద్ధం చేస్తుంది. ఈ ప్రమాదం నిజమైనది కాకపోయినా, మనస్సులో జరుగుతున్న ఊహలు శరీరాన్ని అదే విధంగా అనుభూతి చెందేలా



చేస్తాయి. ఆలోచించేటప్పుడు వేగవంతమైన పల్స్ కూడా మానసిక ఒత్తిడికి సంకేతం కావచ్చు.. ఇది శారీరకంగా కూడా ప్రభావితం చేస్తుంది. రాజీవ్ గాంధీ హాస్పిటల్‌లోని కార్డియాలజీ విభాగానికి చెందిన డాక్టర్ అజిత్ జైన్ వివరిస్తూ.. ఆలోచిస్తున్నప్పుడు హృదయ స్పందన రేటు పెరగడం తప్పనిసరిగా ఏదైనా తీవ్రమైన అనారోగ్యాన్ని సూచించదు.. కానీ అది మానసిక లేదా గుండె సంబంధిత రుగ్మతకు సంకేతం కావచ్చు. ఈ పరిస్థితి తరచుగా జరుగుతుంటే, ముఖ్యంగా విశ్రాంతి సమయంలో కూడా, అది ఆందోళన రుగ్మత, భయాందోళన లేదా టాచీకార్డియా వంటి పరిస్థితులలో భాగం కావచ్చు. కొన్నిసార్లు ఇది థైరాయిడ్ లేదా కెఫిన్ అధికంగా తీసుకోవడం వల్ల కూడా కావచ్చు. దానితో పాటు మైకము, భయము, ఛాతీ నొప్పి, చెమట లేదా శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలు ఉంటే.. వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. దీన్ని ఎక్కువసేపు విస్మరించడం గుండెను ప్రభావితం చేస్తుంది.. ఒక్కోసారి భవిష్యత్తులో తీవ్రమైన గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# బుమ్రా మినహా బౌలర్ల ప్రతిభ బలహీనంగా..

ఇంగ్లండ్‌తో తొలి టెస్టు లో టీమ్ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. 471 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మరోవైపు రెండో రోజు ఆటలో టీమ్ఇండియా స్టార్ బౌలర్ బుమ్రా మినహా మిగతా బౌలర్లు తేలిపోయారు. అతడు ఒక్కడే మూడు వికెట్లు తీయగా.. మరో ఎండ్ నుంచి మద్దతు కరవైంది. దీంతో బుమ్రాను పలువురు మాజీలు మెచ్చుకుంటూనే.. ఇతర బౌలర ప్రదర్శనపై విమర్శలు గుప్పిస్తున్నారు.

టీమ్ఇండియా మాజీ కోచ్ రవిశాస్త్రి ఈ అంశంపై మాట్లాడుతూ.. సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, శార్దూల్ ఠాకూర్‌లు ఒక్క వికెట్ తీయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇంగ్లండ్‌లోని పరిస్థితుల్లో ఇతర బౌలర్లు ఇబ్బందిపడ్డారని.. వారు రాణించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. మరోవైపు మూడు వికెట్లు తీసిన బుమ్రా పనిభారంపై ఆందోళన వ్యక్తం చేశాడు. "సిరీస్ ముందుకు సాగుతున్న కొద్దీ.. బుమ్రా పనిభారంపై నేను ఆందోళన చెందుతున్నాను. ఎందుకంటే అతడు ప్రతి స్పెల్‌లోనూ వికెట్లు తీసే వ్యక్తి. ఇతర బౌలర్ల నుంచి అతడికి సహకారం అవసరం" అని శాస్త్రి ఓ క్రీడా ఛానల్‌తో మాట్లాడుతూ అన్నాడు.

ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ నాసర్ హుస్సేన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. "టీమ్ఇండియాలోని ఇతర బౌలర్లతో బుమ్రాను పోల్చి చూస్తే.. ఆ తేడా స్పష్టంగా కనిపిస్తోంది అతడు అసాధారణమైన బౌలర్. క్యాచ్‌లు నేలపాలు చేయకపోతే అతడికి మరిన్ని వికెట్లు దక్కేవి. అయితే.. ఆట ఇప్పుడే మొదలైంది. ఇతర బౌలర్లు కూడా సిరీస్‌లో ప్రభావం చూపిస్తారు" అని నాసర్ పేర్కొన్నాడు.

**క్యాచ్‌లు వదిలేయడంపై..**

ఇక మ్యాచ్‌లో క్యాచ్‌లు జారవిడవడంపై మాజీ దిగ్గజం సునీల్ గావస్కర్ మండిపడ్డాడు. యశస్వి జైస్వాల్ మంచి ఫీల్డరే కానీ.. క్యాచ్‌లు జారవిడవడం చాలా నిరాశపరిచిందని పేర్కొన్నాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో ఎలాంటి ఫీల్డింగ్ మెడల్స్ ఇవ్వకూడదని కోరాడు.

# పంత్ ఎంట్రీతో రెండు చేతులెత్తి దండం పెట్టిన కేఎల్ రాహుల్..



ఈ మ్యాచ్‌లో భారత్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 359/3 పరుగులు చేసి పటిష్ట స్థితిలో ఉంది. శుభమన్ గిల్, రిషబ్ పంత్ రెండో రోజు ఆటను కొనసాగించనున్నారు. ఈ ఇద్దరి ప్రదర్శనపైనే మ్యాచ్ భవిష్యత్తు ఆధారపడి ఉంది. భారత్, ఇంగ్లాండ్‌ల మధ్య లీడ్స్‌లో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ మొదటి రోజు ఆట ముగిసిన తర్వాత భారత డ్రెస్సింగ్ రూమ్‌లో చోటు చేసుకున్న ఒక దృశ్యం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి నాటౌట్‌గా నిలిచిన రిషబ్ పంత్, శుభమన్ గిల్‌లకు జట్టు సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సమయంలో, సీనియర్ ఆటగాడు కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ ముందు చేతులు జోడిరచి, వినయంగా తల వంచి నమస్కరించడం అందరి దృష్టినీ ఆకర్షించింది. లీడ్స్ టెస్ట్ మొదటి రోజు ఆటలో భారత యువ కెప్టెన్ శుభమన్ గిల్ (127 నాటౌట్), వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ (65 నాటౌట్) అద్భుతమైన బ్యాటింగ్‌తో జట్టును పటిష్ట స్థితిలో నిలబెట్టారు. ముఖ్యంగా, పంత్ తన దూకుడుతో పాటు పరిణతితో కూడిన ఆటను ప్రదర్శించాడు. అతను క్రీజులోకి వచ్చిన తర్వాత ఆట గతిని మార్చి, ఇంగ్లాండ్ బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు. తొలిరోజు ఆట ముగిసిన తర్వాత శుభమన్ గిల్, రిషబ్ పంత్ డ్రెస్సింగ్ రూమ్‌లోకి తిరిగి వస్తుండగా, సహచర ఆటగాళ్లు వారిని ఉత్సాహంగా అభినందించారు. ఈ క్రమంలో, కేఎల్ రాహుల్, డ్రెస్సింగ్ రూమ్ ప్రవేశ ద్వారం వద్ద నిలబడి, పంత్‌కు చేతులు జోడిరచి, తలవంచి గౌరవం చూపించాడు. పంత్ ఆడిన అద్భుతమైన ఇన్నింగ్స్‌కు ఇది కేఎల్ రాహుల్ ప్రశంసగా భావిస్తున్నారు. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతూ, అభిమానులను ఆకట్టుకుంటోంది. కేఎల్ రాహుల్ చేసిన ఈ వినయపూర్వకమైన చర్యపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇది జట్టులో ఆటగాళ్ల మధ్య ఉన్న సత్సంబంధాలకు నిదర్శనమని కొందరు అభిప్రాయపడుతున్నారు. చివరి సెషన్‌లో పంత్ వచ్చి ఆట ఊపును మార్చాడు. వేగంగా పరుగులు చేశాడు. పంత్ 91 బంతుల్లో 65 పరుగులు చేశాడు. అందులో రెండు సిక్సర్లు, ఏడు ఫోర్లు ఉన్నాయి. రాహుల్ కూడా అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. అతను 78 బంతుల్లో 42 పరుగులు చేసి మొదటి వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యాన్ని పంచుకున్నాడు. ఈ మ్యాచ్‌లో భారత్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 359/3 పరుగులు చేసి పటిష్ట స్థితిలో ఉంది. శుభమన్ గిల్, రిషబ్ పంత్ రెండో రోజు ఆటను కొనసాగించనున్నారు. ఈ ఇద్దరి ప్రదర్శనపైనే మ్యాచ్ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

# డబ్ల్యూటీటీ టోర్నీలో భారత ప్యాడ్లర్లకు నిరాశాజనక ఆరంభం

వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) స్టార్ కంటెండర్ టోర్నీ రెండో అంచె పోటీలలో భారత స్టార్ ప్యాడ్లర్లు మనికా బాత్రా, మానవ్ ఠక్కర్‌కు ఆరంభ రౌండ్లలోనే నిరాశ ఎదురైంది. స్లోవేనియాలో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా శుక్రవారం రాత్రి ముగిసిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో మనికా.. 03 (911, 611, 411) తో హి ఝుజియ (చైనా) చేతిలో చిత్తుగా ఓడిపోయింది. తొలి రౌండ్‌లో 30తో పు యు (పోర్చుగల్) ను ఓడించిన మణికా.. చైనా అమ్మాయి ముందు తేలిపోయింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో మానవ్ ఠక్కర్.. 03తో యు ఫి (చైనా) చేతిలో ఓడాడు. అంతకుముందు పురుషుల డబుల్స్‌లో మానవ్, మనుష్ షా జంట సైతం.. తొలి రౌండ్‌లో 13తో (1012, 611, 118, 611)తో కొరియన్ ద్వయం కిమ్ మిన్హెక్‌పార్క్ గంగ్హైన్ జోరు ముందు నిలువలేకపోయింది.




# దిగ్గజ క్రికెటర్ కన్నుమూత..


ఇంగ్లండ్ క్రికెట్‌లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆ జట్టు మాజీ ఫాస్ట్ బౌలర్, గ్లౌసెస్టర్‌షైర్ దిగ్గజం డేవిడ్ వాలెంటైన్ లారెన్స్(61) కన్నుమూశారు. గత కొంత కాలంగా మోటార్ న్యూరోన్ వ్యాధితో బాధపడుతున్న లారెన్స్.. ఆదివారం తుది శ్వాస విడిచారు.

1988లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన లారెన్స్.. ఇంగ్లండ్ తరపున ఐదు టెస్టులు ఆడి 18 వికెట్లు సాధించారు. 1991లో ది ఓవల్‌లో వెస్టిండీస్‌పై అద్భుతమైన ఫైవ్ వికెట్ల హాల్ సాధించారు. ఆ సమయంలో విండీస్ దిగ్గజం వివ్ రిచర్డ్స్‌ను అవుట్ చేశారు.

అయితే అద్భుతమైన టాలెంట్ ఉన్నప్పటికి మెకాలి గాయం కారణంగా 1992లో ఆయన్ కెరీర్‌కు ఎండ్ కార్డ్ పడింది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మాత్రం ఆయన ఎన్నో ఘనతలను అందుకున్నారు. 185 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన లారెన్స్..515 వికెట్లు పడగొట్టారు. లిస్ట్ఎ క్రికెట్‌లో కూడా ఆయన పేరిట 155 వికెట్లు ఉన్నాయి.



# శక్తిమాన్'లో అల్లు అర్జున్ హీరో కాదు



అల్లు అర్జున్ హీరోగా మలయాళ దర్శకుడు, నటుడు బసిల్ జోసెఫ్ ఓ భారీ సినిమా రూపొందించనున్నారంటూ గత కొన్నిరోజులుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబోలో 'శక్తిమాన్' రానుందని టాక్. నెట్టింట వైరల్‌గా మారిన ఈ కథనాలను ఉద్దేశించి బసిల్ జోసెఫ్ తాజాగా స్పందించారు. ఆ కథనాల్లో వాస్తవం లేదని స్పష్టత నిచ్చారు. 'శక్తిమాన్' పూర్తిగా బాలీవుడ్ రణ్‌వీర్ సింగ్ చిత్రమన్నారు. ఆయనతోనే ఆ సినిమా ఉంటుందని వెల్లడించారు. 90ల తరానికి బాగా సుపరిచితమైన ధారావాహిక 'శక్తిమాన్' . నాటి ప్రేక్షకులకు ఎంతో సుపరిచితమైన ఈ పాత్రతో ఓ భారీ ప్రాజెక్ట్ రూపొందించాలని ఎంతోకాలం నుంచి బాలీవుడ్‌లో ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కథ కోసం బాలీవుడ్ రణ్‌వీర్ సింగ్‌ను సంప్రదించినట్లు గతంలో వార్తలొచ్చినా.. అది కార్యరూపం దాల్చిన దాఖల్లాల్లేవు. తాజా క్లారిటీతో ఆ సినిమా రణ్‌వీర్‌తోనే ఉంటుందనే స్పష్టత వచ్చింది.

**సినిమాల్లో అది సాధ్యపడకపోవచ్చు: ఇష్టమైన పాత్రపై పవన్ కల్యాణ్**

'పుష్ప 2' విజయం తర్వాత విభిన్నమైన ప్రాజెక్ట్‌లు ఎంచుకుంటూ సినీ ప్రియులను ఆశ్చర్యపరుస్తున్నారు అల్లు అర్జున్. ప్రస్తుతం ఆయన కోలీవుడ్ దర్శకుడు అట్లీతో ఓ భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. సన్ పిక్చర్స్ పతాకంపై ఈ సినిమా నిర్మితం కానుంది. సమాంతర ప్రపంచం, పునర్జన్మల కాన్సెప్ట్‌తో ముడిపడి ఉండే సైన్స్‌ఫిక్షన్ సినిమాగా ఇది ముస్తాబు కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీపికా పదుకొణె కథానాయిక. మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్‌తోనూ ఆయన ఒక సినిమా చేసే అవకాశం ఉందని టాక్. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఇప్పటికే చర్చలు కూడా మొదలయ్యాయని టాక్.

# 'దయచేసి కన్నప్ప సినిమాను ట్రోల్ చేయకండి'..


కన్నప్ప మూవీ ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో హాస్య నటుడు బ్రహ్మానందం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కన్నప్ప సినిమాను శివతత్త్వం వ్యాప్తి చేయడానికి తీశారు. డబ్బు కోసం కాదు. అందరినీ ఒకేలా చూసే ఆ శివుడి గురించి ప్రపంచానికి చెప్పేందుకు మోహన్ బాబు, విష్ణు బాబు ఈ మూవీని ముందుకు తీసుకొస్తున్నారు. ఈ మూవీని ఎవ్వరూ అడ్డుకోకండి. ఇదొక గొప్ప చిత్రం అవుతుంది. కన్నప్ప ఒక చరిత్ర అవుతుంది. ఈ సినిమాను, ఈ పాత్రధారుల్ని ఆ శివుడే ఎంచుకున్నాడు. జూన్ 27న కన్నప్ప రాబోతోంది. భక్తితత్వంలోకి మన అందరినీ తీసుకుపోవాలనే ఆలోచన గొప్పది. ఈ భూమ్మీద 'కన్నప్ప' అనేది గొప్ప చిత్రం అవుతుంది. దయచేసి ఆదరించండి.. కానీ అల్లరిపాలు చేయకండి' అని అభిమానులకు బ్రహ్మానందం విజ్ఞప్తి చేశారు. కాగా, కన్నప్ప మూవీ జూన్ 27న ప్రపంచ వ్యాప్తంగా ఐదు భాషల్లో విడుదల కాబోతోంది. ఈ చిత్రానికి బాలీవుడ్ దర్శకుడు ముఖేష్ కుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రీతి ముకుందన్, మోహన్ బాబు, శరత్ కుమార్, మధు, ముఖేష్ రిషితో పాటు మోహన్‌లాల్, ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ వంటి స్టార్స్ ఈ సినిమాలో కీలకపాత్ర పోషిస్తున్నారు. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అంతేకాకుండా ఈ సినిమాకు స్వయంగా మంచు విష్ణు కథ, స్క్రీన్‌ప్లే అందించారు.



# హీరోగా వర్కౌట్ కాలేదా ? అందుకే మళ్లీ

సినిమా ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడం అంటే సాధారణమైన విషయం ఏం కాదు. స్టార్ హీరోల వారసులైనా సరే సరైన మూవీస్ చేస్తేనే నిలబడతారు. లేదంటే మెల్లగా సైడ్ అయిపోతారు. ఇదంతా ఇప్పుడు ఎందుకంటే తెలుగులో యాంకర్‌గా టాప్‌లో ఉండే ప్రదీప్.. గత కొన్నేళ్లుగా తన ప్రొఫెషన్‌ని పక్కనబెట్టి హీరోగా ప్రయత్నాలు చేశాడు. కానీ పెద్దగా వర్కౌట్ కాలేదు. దీంతో ఎక్కడైతే మొదలుపెట్టాడో అక్కడికే వచ్చేశాడు.

యాంకర్‌గా ప్రదీప్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. చాలా ఏళ్ల నుంచి ఛానల్‌తో డ్యాన్స్, కామెడీ షోలకు యాంకరింగ్ చేస్తూ వచ్చాడు. ఇవి చేస్తూనే అత్తారింటికి దారేది, 100% లవ్ తదితర చిత్రాల్లో సహాయ పాత్రల్లో కనిపించాడు. కొన్నాళ్ల తర్వాత మంచి గుర్తింపు రావడంతో హీరోగా ప్రయత్నిద్దామని '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?' అనే సినిమాతో హీరోగా మారాడు. ఈ మూవీలో ఒక్క పాట తప్పితే సినిమా పెద్దగా ఆడలేదు. దీంతో చాలా గ్యాప్ తీసుకుని 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' అనే చిత్రంతో వచ్చాడు.



# బంపర్ ఆఫర్ అందుకున్న స్టార్ కిడ్

ముదస్సర్ అజీజ్ దర్శకత్వంలో వచ్చిన బాలీవుడ్ మూవీ 'పతీ పత్నీ ఔర్ వో' ఎలాంటి హిట్ అందుకుందో తెలిసిందే. కార్తీక్ ఆర్యన్, భూమి పడ్నేకర్, అనన్య పాండే ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీని టి-సిరీస్ బ్యానర్‌పై భూషన్ కుమార్, రేణు రవి చోప్రా, కృష్ణన్ కుమార్ నిర్మించారు. ఫుల్ ఫన్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కిన ఈ చిత్రం 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ సక్సెస్ అందుకుంది. ఇప్పుడు దీనికి సీక్వెల్ తెరకెక్కించే పనిలో ఉన్నారు మేకర్స్. ఈ క్రమంలోనే తాజాగా ఈ మూవీ సీక్వెల్‌కు సంబంధించిన లేటెస్ట్ అప్డేట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది.



ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తిన 'పతి పత్నీ ఔర్ వో' సీక్వెల్‌లో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ సారా అలీఖాన్‌ను ఫిక్స్ చేశారట మేకర్స్. ఆయుష్మాన్ , సారా ప్రధాన పాత్రల్లో ఈ సీక్వెల్ తెకెక్కుతుందని తెలుస్తుండగా.. ధర్మా ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు టాక్. అయితే.. దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది. కాగా.. సారా త్వరలో 'మెట్రో ఇన్ దినో'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఇంకా ఈ సినిమా విడుదల కాకముందే.. హిట్ సీక్వెల్‌లో సారా నటించబోతున్నట్లు వార్తలు వైరల్ అవుతుండగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# నిర్మాతగా మారిన మరో యంగ్ హీరో..



ప్రస్తుతం ఇండస్ట్రీలో చాలా మంది హీరోలు.. సినిమాల్లో నటిస్తూనే మరొపక్కా నిర్మాతలుగా మారి నిర్మిస్తున్నారు కూడా. సొంతగా బ్యానర్స్ స్థాపించి కొత్త దర్శకులకు అవకాశాలు ఇస్తూ సినిమాలను నిర్మించడంతో పాటు.. ఇతర సంస్థలతో కలిసి తమ సినిమాలను తామే నిర్మించుకుంటున్నారు. ఇప్పటికే ఈ లిస్ట్‌లో నేచురల్ స్టార్ నాని, మహేశ్ బాబు, ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, అల్లు అర్జున్ వంటి చాలా మంది హీరోలు ఉండగా.. తాజాగా ఈ లిస్ట్‌లోకి మరో యంగ్ రామ్ పోతునేని కూడా జాయిన్ అయినట్లు తెలుస్తోంది.

రామ్ సొంత బాబాయ్ రవి కిషోర్ శ్రావంతి మూవీస్ బ్యానర్‌పై ఎన్నో హిట్ సినిమాలు చేశారు. ఆయన వారసుడిగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన రామ్ హీరో అయ్యాడు. ఇప్పుడు బాబాయ్ బాటలోనే కొత్త ప్రొడక్షన్ బ్యానర్‌ను రంగంలోకి దించే ప్లానింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే.. రామ్ సొంత బ్యానర్‌పై ఇంకా అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాలేదు కానీ.. ఈ బ్యానర్‌లో రామ్ తన సొంత సినిమాలను నిర్మిస్తాడా..? లేదా కొత్త డైరెక్టర్లకు అవకాశం ఇచ్చి వారి సినిమాలు నిర్మిస్తాడా అనే చర్చలు మాత్రం నెట్టింట షురూ అయ్యాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in